మద్యం దుకాణాలకు పోటాపోటీ

■ పక్క రాష్ట్రాల వారు ఆసక్తి
■ వెల్లువలా దరఖాస్తులు

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే: జిల్లాలో మద్యం దుకాణాల అనుమతులకు దరఖాస్తులు భారీగా నమోదవుతున్నాయి. తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాలతోపాటు పొరుగు జిల్లాలకు చెందిన రాజకీయ నాయకులు, వ్యాపారులు దరఖాస్తు చేసుకుంటున్నారు. 99 దుకాణాలకు బుధవారం సాయంత్రం వరకు 2,053 దరఖాస్తులు నమోదయ్యాయి. ఒక్క బుధవారమే సుమారు 500 దరఖాస్తులు నమోదయ్యాయి. స్టేషన్ల వారీగా కర్నూలు-955, కోడుమూరు-349, ఆదోని-181, ఆలూరు-151, పత్తికొండ-199, ఎమ్మిగనూరు-182, కోసిగి-36 దరఖాస్తులు పడ్డాయి. ఈ లెక్కన గమనిస్తే సగటున ఒక్కో దుకాణానికి 20 వచ్చాయి. ఇంకా రెండు రోజులు గడువు ఉండటంతో మరో వెయ్యి దరఖాస్తులు నమోదు కావచ్చని ఆబ్కారీ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు.

గడువు పొడిగింపు

మద్యం అనుమతులకు సంబంధించి దరఖాస్తు నమోదుకు గడువును మరో రెండురోజులు పొడిగించినట్లు మద్యనిషేధ, ఆబ్కారీ శాఖ కర్నూలు పర్యవేక్షణాధికారి సుధీర్‌బాబు తెలిపారు. ఈ నెల 11వ తేదీ సాయంత్రం 7 గంటల వరకు దరఖాస్తు చేసుకోవచ్చని, 14న కర్నూలులోని జడ్పీ సమావేశ మందిరంలో లక్కీడిప్ నిర్వహించి అనుమతులు ఖరారు చేస్తామన్నారు.



తల్లిడిల్లె

పరీక్షల నిమిత్తం వెళ్లిన గర్భిణులకు అవస్థలు తప్పలేదు. గంటల తరబడి వేచిఉండాల్సి రావడంతో ఇబ్బందులు పడ్డారు. ప్రధాన మంత్రి సురక్షిత్ మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా పత్తికొండ ప్రభుత్వ ఆసుపత్రిలో గర్భిణులకు బుధవారం పరీక్షలు నిర్వహించారు. పత్తికొండ, చుట్టుపక్కల ప్రాంతాల నుంచి సుమారు 200 మంది గర్భిణులు వచ్చారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు రక్త పరీక్ష, స్కానింగ్ వంటి పలు పరీక్షలు చేసేందుకు నిరీక్షించారు.

– న్యూస్‌టుడే, పత్తికొండ పట్టణం


తెలంగాణలో కొలువుదీరారు



తెలంగాణ డీఎస్సీ ఫలితాల్లో ప్రతిభ చాటి ఉపాధ్యాయ ఉద్యోగానికి ఎంపికయ్యారు దేవనకొండ మండలం తెర్నేకల్‌కు చెందిన తేజేశ్వరి. వ్యవసాయ కుటుంబంలో జన్మించిన ఆమె పదో తరగతి వరకు గ్రామంలోనే చదివారు. కర్నూలులో ఇంటర్, వైఎస్సార్ జిల్లా రాయచోటిలో టీటీసీ పూర్తి చేశారు. మొదటి ప్రయత్నంలోనే తెలంగాణ డీఎస్సీలో 78.77 మార్కులతో ఉద్యోగం సాధించారు. ఆంధ్రప్రదేశ్‌లో ఫిబ్రవరిలో నిర్వహించిన టెట్‌లో 150 మార్కులకుగానూ 148 వచ్చాయి. –దేవనకొండ, న్యూస్‌టుడే:

పేదల ఇళ్లు.. పెద్దల దోపిడీ

■ పూర్తికాని గృహాలకు రూ.77.31 కోట్లు బిల్లులు
■ నిర్మాణాల్లో అక్రమాలపై విజిలెన్సు విచారణ



కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే:

గత వైకాపా పాలకులు పేదలకు గృహాలు నిర్మిస్తున్నామని చెప్పి పెద్దలకు రూ.77.31 కోట్లు దోచి పెట్టారు.. ఇల్లు నిర్మించుకోలేమన్న లబ్ధిదారులకు ఆప్షన్-3 కింద గుత్తేదారులతో నిర్మించి ఇస్తామని నమ్మించారు. ఇందుకు ప్రభుత్వం రూ.1.80 లక్షలు చెల్లిస్తే లబ్ధిదారులు రూ.35 వేలు గుత్తేదారుల ఖాతాకు జమ చేయాల్సి ఉంటుందన్నారు. 13 మండలాలు, రెండు పురపాలికల్లో ఇళ్లు నిర్మించేందుకు 22 గుత్తేదారు సంస్థలు ముందుకొచ్చాయి. పెద్ద సంస్థలు ఒక్క ఇంటిని పూర్తి చేయలేదు. చిన్న సంస్థలు 84 ఇళ్లను నిర్మించాయి. పక్కా గృహాలు నిర్మిస్తామని బడా సంస్థలు రూ.కోట్ల అడ్వాన్సులు దండుకున్న వైనం తాజాగా విజిలెన్సు విచారణలో వెలుగులోకి వచ్చింది.

- ఎంపిక చేసిన మండలాలు 13, ఆదోని, ఎమ్మిగనూరు పురపాలికలు
- ముందుకొచ్చిన గుత్తేదారులు: 22
- మొత్తం నిర్మించాల్సిన ఇళ్లు 10,596
- పూర్తి అయినవి: 84
- నిర్మాణదారులకు చెల్లించింది: రూ.98.77

రూ.2.20 కోట్లు అప్పగించారు

ఆలూరులో ఆర్టా వెంచర్స్ సంస్థ 309 ఇళ్ల నిర్మాణాలు చేపట్టేందుకు మూడేళ్ల కిందట ముందుకొచ్చింది. రూ.2.20 కోట్ల అడ్వాన్సు రూపంలో ప్రభుత్వం చెల్లించినా, ఇప్పటికీ రూఫ్ లెవెల్‌లో 64 ఇళ్లు ఉన్నాయి. ఒక్కటీ పూర్తి కాకపోవడం గమనార్హం.

మండలం	నిర్మించాల్సినవి	నిర్మించినవి	ఖర్చు చేసింది (రూ. కోట్లలో)
ఆదోని	717	18	4.56
ఆదోని అర్బన్	4,970	0	55.95
ఆలూరు	398	0	2.44
చిప్పగిరి	249	1	1.13
దేవనకొండ	29	0	0.36
గోనెగండ్ల	293	20	1.87
హాలహర్వి	383	14	2.12
హొళగుంద	297	0	1.89
కోసిగి	665	0	2.99
కౌతాళం	360	0	1.78
మంత్రాలయం	756	31	4.74
నందవరం	180	0	1.54
పెద్దకడబూరు	125	0	0.66
ఎమ్మిగనూరు	125	0	1.06
ఎమ్మిగనూరు అర్బన్	1,022	0	15.61

మూడు సంస్థలపై సమగ్ర వివరాల సేకరణ

బోయిళ్ల కన్‌స్ట్రక్షన్, బోయిళ్ల జనార్దన్, ఆర్టా వెంచర్స్ సంస్థలపై రాష్ట్ర ప్రభుత్వం విజిలెన్స్ విచారణకు ఆదేశించింది. జిల్లా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సమగ్ర సమాచారాన్ని సేకరించారు. ఇళ్ల నిర్మాణాల్లో నాణ్యత, గృహ నిర్మాణ సంస్థ సరఫరా చేసిన సిమెంట్, ఇనుము ఏమైనా పక్కదారి పట్టిందా, ప్రస్తుతం నిర్మిస్తున్న ఇళ్ల నిర్మాణాలు ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారమే ఉన్నాయా లేదా తదితర వాటిపై విచారణ చేయనున్నారు. మూడు సంస్థలు 6,823 ఇళ్ల నిర్మాణాలు చేపడతామని మూడేళ్ల కిందట ఒప్పందం చేసుకున్నాయి. వివిధ దశల్లో ఇళ్ల నిర్మాణాలు ఉన్నాయని చూపుతున్నా మూడేళ్లలో ఒక్కటంటే ఒక్కటీ పూర్తి చేయలేదు. అయితే రూ.77.31 కోట్ల బిల్లులు చెల్లించారు. ఆ సంస్థల వైకాపా నేతలకు సంబంధించినవి కావడంతో ముందే బిల్లులు తీసుకున్నాయనే విమర్శలున్నాయి.

ఒక్కటి పూర్తిచేయకున్నా.. రూ.75 కోట్లు చెల్లింపులు

- బోయిళ్ల జనార్దన్ సంస్థ ఎమ్మిగనూరు మండలంలో 125, ఎమ్మిగనూరు పురపాలికలో 1,022, మంత్రాలయంలో 397 ఇళ్లు నిర్మించాల్సి ఉండి.. సదరు సంస్థకు రూ.19.16 కోట్ల అడ్వాన్స్ రూపంలో ఇచ్చారు. ఒక్క ఇంటి నిర్మాణం పూర్తి చేయలేదు.
- బోయిళ్ల కన్‌స్ట్రక్షన్ సంస్థ ఆదోని పురపాలకలో 4,970 ఇళ్ల నిర్మాణాలు చేపడుతోంది. మూడేళ్లయినా ఒక్కటీ పూర్తి చేయలేదు. రూ.55.95 కోట్ల అడ్వాన్సుల రూపంలో ముందుగానే తీసుకుంది. మూడేళ్లుగా 2,512 ఇళ్లు వివిధ దశల్లోనే ఉన్నాయి.
- బోయిళ్ల కన్‌స్ట్రక్షన్, బోయిళ్ల జనార్దన్ అనే సంస్థలు చూడటానికి రెండు కంపెనీలైనా.. నడిపించేది ఒక్కరే. నెల్లూరుకు చెందిన సంస్థ. ఒక్కటంటే ఒక్క ఇంటి నిర్మాణం కూడా పూర్తి చేయలేదు. అయినా ఆ సంస్థలకు ఏకంగా రూ.75.11 కోట్లు చెల్లించడమే విచిత్రంగా ఉంది. నిర్మాణాలు నాసిరకంగా ఉన్నాయి. ఏ ఒక్క ఇంజినీర్ అటువైపు తొంగి చూడలేదు. సదరు గుత్తేదారు గత ఎన్నికల్లో వైకాపా ఎమ్మెల్యే అభ్యర్థులకు నిధులు సమకూర్చారనే ఆరోపణలున్నాయి.

ఆరు సంస్థలు అష్టకష్టాలు పడి

మంత్రాలయంలో వెంకటేశ్వర కన్‌స్ట్రక్షన్ సంస్థ 31, హాలహర్విలో బి.ఓబులపతి 9, వి.కృష్ణమూర్తి 5, గోనెగండ్లలో వెంకటేశ్వర కన్‌స్ట్రక్షన్ 5, శ్రీగాయత్రీ కన్‌స్ట్రక్షన్ 13, అన్నాజీ గిరీశ్వరరెడ్డి 2, చిప్పగిరి మండలంలో రెయిన్ ఇన్‌ఫ్రా సంస్థ 1, ఆదోనిలో మండలం శ్రీవెంకటేశ్వర కన్‌స్ట్రక్షన్ సంస్థ 18 ఇళ్లు నిర్మించారు.


ఆదోనిలో గోడలకు పగుళ్లు

నాసిరకం విత్తనం తిప్పి పంపిన రైతులు



ఆస్పరి, న్యూస్‌టుడే: రబీ సీజన్‌లో సాగు చేసేందుకు ప్రభుత్వం ఇస్తున్న పప్పుశనగ విత్తనాలు నాసిరకంగా ఉన్నాయని రైతులు తిప్పి పంపారు. ఆస్పరి మండలానికి 6,300 క్వింటాళ్లు అవసరమని ప్రతిపాదనలు పంపగా, 4,791 క్వింటాళ్లు మంజూరు చేశారు. రైతుల పేర్లు నమోదు ప్రకారం 2,500 క్వింటాళ్లు అవసరమని అధికారులు గుర్తించారు. ఆస్పరి, జొహరాపురం గ్రామాలకు 250 క్వింటాళ్ల ఏపీ సీడ్స్‌వారి రాయితీ పప్పుశనగల పంపిణీని వ్యవసాయాధికారులు బుధవారం ప్రారంభించారు. ఆస్పరికి కేటాయించిన విత్తనాలు నాసిరకంగా ఉన్నాయని రైతులు అభ్యంతరం తెలిపారు. వ్యవసాయ శాఖ ఏడీఏ సునీత, ఏవో నరేంద్రకుమార్ పరిశీలించారు. సన్నగా, పగిలిపోయి ఉన్నాయని తేల్చారు. జిల్లా అధికారులతో మాట్లాడి వచ్చిన 250 క్వింటాళ్ల విత్తనాలను వెనక్కి పంపారు.

పోలీసు శాఖలో బదిలీలకు రంగం సిద్ధం

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే: జిల్లా పోలీసు శాఖలో ఏఎస్సై, హెడ్‌కానిస్టేబుల్, కానిస్టేబుల్ బదిలీలపై రంగం సిద్ధమైంది. ఒకే స్థానంలో ఐదేళ్ల పూర్తయిన పోలీసులు 130 మంది ఉన్నట్లు గుర్తించి జాబితాను రూపొందించిన అధికారులు వారికి కావాల్సిన స్టేషన్ల వివరాలు అడిగి తెలుసుకున్నారు. డీఎస్పీలు బుధవారం సమావేశమై సదరు ఉద్యోగుల స్థానచలనంపై చర్చించారు.



చెదిరిన కల.. ఆగని కన్నీటి అల

రెక్కలు ముక్కలు చేసుకొని చదివించారు. కుమారుడి కలలు తమవిగా భావించారు. కొలువులో చేరగానే సంబరపడ్డారు. ఇన్నేళ్ల కష్టమంతా మరిచారు. ఇంటికొచ్చిన కుమారుడు అమ్మచేతితో ఫలహారం తిని.. వెళ్లొస్తానమ్మా అంటూ తిరుగు ప్రయాణమయ్యారు. అంతలోనే తిరిగిరాని లోకాలకు వెళ్లి తల్లిదండ్రులకు కన్నీళ్లు మిగిల్చారు. రహదారి ప్రమాదం ఆ కుటుంబంలో విషాదం నింపింది.

పత్తికొండ పట్టణ శివారులోని గుత్తి ప్రధాన రహదారిలో బుధవారం జరిగిన ప్రమాదంలో ఆలూరు మండలం పెద్దహోతూరుకు చెందిన సాయి కేశవ (24) దుర్మరణం చెందారు. రెండేళ్లుగా బెంగళూరులో సాఫ్ట్‌వేర్‌గా పని చేస్తున్నారు. రెండ్రోజుల కిందట స్వగ్రామానికి వచ్చి తిరిగి బయల్దేరారు. చెన్నై నుంచి ఆదోని వైపు వెళ్తున్న లారీ ప్రధాన రహదారిలో మలుపు వద్ద ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ద్విచక్ర వాహనం లారీ కిందకు వెళ్లడంతో యువకుడి దేహం ఛిద్రమైంది. ఒక్కగానొక్క కుమారుడు దూరం కావడంతో తల్లిదండ్రులు జయమ్మ, గోవిందరాజులు గుండెలవిసేలా రోదిస్తున్నారు. శిక్షణ డీఎస్పీ ఉషశ్రీ, పత్తికొండ సీఐ జయన్న ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

– న్యూస్‌టుడే, పత్తికొండ గ్రామీణం, పత్తికొండ పట్టణం

కాళరాత్రి దేవి.. శుభాలిచ్చే తల్లి


గజ వాహనంపై కొలువుదీరిన స్వామిఅమ్మవారు

ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రమైన శ్రీశైల మహాక్షేత్రంలో దసరా మహోత్సవాలు సందడిగా జరుగుతున్నాయి. ఉత్సవాల ఏడో రోజైన బుధవారం భ్రమరాంబాదేవి భక్తులకు కాళరాత్రి అలంకారంలో దర్శనమిచ్చారు. చుడడానికి భయంకరంగా ఉన్నప్పటికీ కాళరాత్రి దేవి భక్తులకు ఎల్లప్పుడూ శుభాలను కలిగిస్తుందని ప్రతీతి. అక్కమహాదేవి అలంకార మండపంలో విశేష పుష్పాలంకరణలతో ముస్తాబు చేసిన గజ వాహనంపై స్వామిఅమ్మవార్లు శోభాయమానంగా కొలువుదీరారు. కళాకారులు వివిధ వేషధారణలతో భక్తులను ఆకట్టుకున్నారు.

శ్రీశైలంలో నేడు : శ్రీశైల మహాక్షేత్రంలో దసరా మహోత్సవాల ఎనిమిదో రోజు గురువారం రాత్రి 7 గంటలకు భ్రమరాంబాదేవి భక్తులకు మహాగౌరి అలంకారంలో దర్శనమివ్వనున్నారు.


ఉత్సవంలో భక్తులను అలరిస్తున్న కళాకారులు


కోనేరు చుట్టూ తాత్కాలిక కంచె

దేవరగట్టు.. సంబరాల మెట్టు

12వ తేదీన జైత్ర యాత్ర
బన్ని ఉత్సవాలకు ఏర్పాట్లు

హాలహర్వి, హొళగుంద, న్యూస్‌టుడే: దేవరగట్టు.. ఆధ్యాత్మిక సంబరానికి మెట్టు. సంప్రదాయ సంబరాలకు సిద్ధమవుతోంది. హొళగుంద మండల పరిధిలో దేవరగట్టులో వెలసిన మాళ మల్లేశ్వర స్వామి బన్ని జైత్ర యాత్ర ఈ నెల 12వ తేదీన జరగనుంది. ఉత్సవాన్ని తిలకించేందుకు మూడు రాష్ట్రాల నుంచి లక్షలాది మంది భక్తులు రానున్నారు. వారికి ఎలాంటి ఇబ్బందులు రాకుండా అన్ని సౌకర్యాలు సమకూర్చేందుకు ఆలయ కమిటీ నిర్వాహకులు, ఆయా శాఖల అధికారులు చర్యలు చేపట్టారు. ఇప్పటికే దేవరగట్టుకు వెళ్లే మార్గంలో రహదారి మరమ్మతులు చేపట్టారు. గట్టుపై విద్యుత్తు సమస్య తలెత్తకుండా అదనంగా విద్యుత్తు నియంత్రికలు ఏర్పాటు చేశారు. అందరి కదలికలను నిరంతరం పర్యవేక్షించేందుకు సుమారు 250కి పైగా సీసీ కెమారాలు బిగిస్తున్నారు. బన్ని జైతయాత్రను విజయవంతం అయ్యేందుకు అన్ని రకాలు చర్యలు చేపట్టినట్లు వారు పేర్కొన్నారు.

50 పడకల వైద్యశాల

ఉత్సవంలో భాగంగా జరిగే కర్రల సమరంలో గాయడే వారికి చికిత్స అందించేందుకు ప్రత్యేకంగా సుమారు 30 నుంచి 50 మంచాలతో వైద్యశాల ఏర్పాటు చేశారు. ప్రథమ చికిత్స సామగ్రి, మందులు, 108 వాహనాలు రెండు నుంచి నాలుగు వాహనాలు ఉండేందుకు ప్రత్యేక స్థలం కేటాయించారు. ఆలూరు నియోజకవర్గ పరిధిలోని వైద్య సిబ్బందితో పాటు జిల్లా కేంద్రం నుంచి ప్రత్యేక సిబ్బంది రానున్నారు.

నిరంతరం మంచినీటి సరఫరా

- ఉత్సవంలో పారిశుద్ధ్యం లోపించకుండా హొళగుంద, ఆలూరు, హాలహర్వి మండలాలకు చెందిన మండల స్థాయి, పంచాయతీ కార్యదర్శులు, ప్రత్యేక సిబ్బంది ఎప్పటికప్పుడు పనులు చేపట్టేలా ప్రణాళిక సిద్ధం చేసుకున్నారు.
- నిరంతరం తాగునీరు సరఫరా అయ్యేలా చూస్తామని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు చెబుతున్నారు.
- చీకట్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు, ప్రమాదాలు జరగకుండా ముందస్తుగా కొండ చుట్టూ విద్యుత్తు సౌకర్యం కల్పించారు. మద్యలో ఇబ్బందులు రాకుండా ఆలూరు సబ్ డివిజన్‌లో సిబ్బంది అందుబాటులో ఉంటారు.

బడి పిల్లలకు పోషకాహారం

■ మధ్యాహ్న భోజన పథకంలో మార్పులు

కర్నూలు విద్య, న్యూస్‌టుడే: విద్యార్థులకు నాణ్యమైన మెనూ అందించేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. జిల్లా స్థాయిలో చర్చించి మెనూలో మార్పులకు శ్రీకారం చుట్టింది. జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో అధికారులు, యాజమాన్య కమిటీ సభ్యులు, ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులు, పథకం నిర్వాహకులతో మాట్లాడి అభిప్రాయ సేకరణ జరిపారు. జిల్లాలో నిత్యం 2.81 లక్షల మంది విద్యార్థులు పాఠశాలల్లో డొక్క సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా భోజనం చేస్తున్నారు. ఇటీవల జిల్లా స్థాయిలో చర్చించి రూపొందించిన నివేదికను విద్యా శాఖ అధికారులు కలెక్టర్‌కు అందించారు.



నివేదిక పంపించాం

– శామ్యూల్‌పాల్, మధ్యాహ్న భోజన పథక సంచాలకులు

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు చదువుతోపాటు నాణ్యమైన భోజనం అందించాల్సిన అవసరం ఉంది. రుచికర భోజనం వడ్డిస్తే ప్రవేశాలు సైతం పెరిగే అవకాశాలుంటాయి. విద్యాశాఖలో ఉన్న ప్రతి ఒక్కరితో చర్చించి తయారుచేసిన కొత్త మెనూను కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి నివేదించాం. ఇందులో ఎక్కువగా శక్తి సామర్థ్యాన్ని ఇచ్చే పోషకాలు చేర్చాం.

కమిటీల సూచనలు

గత ప్రభుత్వ హయాంలో అమలుచేసిన మధ్యాహ్న భోజన మెనూపై చాలామంది విద్యార్థులు అసంతృప్తితో ఉన్నారు. చాలా మంది సోమవారం, శుక్రవారాల్లో గుడ్డు తినేందుకు ఆసక్తి చూపరు. ఆలూ కుర్మా, పచ్చడి, రాగి జావకు పలువురు విద్యార్థులు దూరంగా ఉంటున్నట్లు తల్లిదండ్రుల కమిటీలు తెలిపాయి. ఆయా రోజుల్లో ఆయా వంటకాలు చేసినా చాలామంది తినక పోవడంతో పారేయాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో విద్యార్థుల ఇష్టానికి అనుగుణంగా మెనూ రూపొందించాలని కూటమి ప్రభుత్వ నిర్ణయించింది. ఇందులో భాగంగానే కొత్త మెనూ పరిశీలనకు జిల్లా అధికారులు ప్రభుత్వానికి నివేదించారు.

వారం	ప్రతిపాదించిన మెనూ
సోమ	పొంగలి లేదా వెజ్ పలావ్, వంకాయ కర్రీతోపాటు చిక్కీ, ఉడికించిన పల్లీలు
మంగళ	పులిహోరాతోపాటు వెజిటేబుల్ కర్రీ, గుడ్డు, రాగి బిస్కెట్
బుధ	వెజిటేబుల్ రైస్, ఆలూ కుర్మా, గుడ్డు, పెరుగు చెట్నీ
గురు	అన్నం సాంబారు, గుడ్డు, బఠానీలు, రాగీ బిస్కెట్
శుక్ర	అన్నం పప్పు, గుడ్డు, మిల్లెట్ చిక్కీ
శని	ఆకుకూరలతో అన్నం, పప్పుచారు లేదా రవ్వ కేసరి, శనగ బేడల స్వీట్

సాగునీటి సంఘాల ఎన్నికలకు కసరత్తు

■ నవంబరు 16 నుంచి మూడు విడతలుగా నిర్వహణ
■ ఓటర్ల జాబితా సిద్ధం చేస్తున్న అధికారులు

కర్నూలు జలమండలి, న్యూస్‌టుడే: సాగునీటి సంఘాల ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు సమాయత్తమవుతున్నారు. వచ్చే నెల 16 తేదీ నుంచి మూడు విడతలుగా జరిగే ఎన్నికల షెడ్యూలు బుధవారం విడుదల కావడంతో జలవనరులు, రెవెన్యూ శాఖల అధికారులు ఎన్నికల ప్రక్రియలో నిమగ్నమయ్యారు. నవంబరు 16న ప్రాదేశిక నియోజకవర్గం (టీసీ), 19న డిస్ట్రిబ్యూటరీ కమిటీ (డీసీ), 22న ప్రాజెక్టు కమిటీ (పీసీ)లకు ఎన్నికలు జరగనున్నాయి. ప్రకటన విడుదలైన 40 రోజుల్లో సాగునీటి సంఘాల ఎన్నికలు పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈమేరకు అధికారులు ఏర్పాట్లు, ఆయకట్టు రైతుల జాబితా సేకరణ, ఇతర ప్రక్రియలపై కసరత్తు చేస్తున్నారు. “ ఆయకట్టుదారులందరూ ఓటర్లుగా గుర్తింపు పొందుతారు.. ఈ నెల 24లోగా జాబితాలు అందజేయాలని ఎస్ఈ రెడ్డి శేఖర్ రెడ్డి ఆదేశించారు.


నీటి వనరు		సంఘాలు
ఎల్లెల్సీ	:	58
కేసీ కాల్వ	:	2
గాజులదిన్నె	:	12
ఎం.ఐ. చెరువులు	:	48

మహిళలకు పిలుపు

కస్తూర్బాలో కొలువులు
■ దరఖాస్తుకు నేడు ఆఖరి రోజు

కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాల్లో విద్యా నైపుణ్యాలు మెరుగుపర్చేందుకు కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా కేజీబీవీల్లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి ప్రకటన విడుదల చేసింది. ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు బోధించడానికి సీఆర్టీలు, ఇంటర్‌కు పీజీటీలు, అదే విధంగా పార్ట్‌టైమ్ ఉపాధ్యాయినులు, బోధనేతర సిబ్బంది ఉంటారు. వీటిలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఖాళీలను భర్తీ చేయనున్నట్లు అధికారంలోకి వచ్చిన తర్వాత మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ ప్రకటించారు. దీనికి అనుగుణంగా కార్యాచరణ చేపట్టారు. ఒప్పంద, పొరుగు సేవల విధానంలో ఏడాది ప్రాతిపదికన ఖాళీల భర్తీ కోరుతూ ప్రకటన విడుదల చేశారు.

కర్నూలు విద్య, న్యూస్‌టుడే:



వెబ్‌సైట్‌లో దరఖాస్తులు

ఉమ్మడి కర్నూలు జిల్లాలోని 54 కేజీబీవీల్లో ప్రిన్సిపల్స్, పీజీటీలు, సీఆర్టీలు, కంప్యూటర్, ఒకేషనల్, అకౌంటెంట్లు, వార్డెన్లు కలిపి మొత్తం 83 ఖాళీలు ప్రకటించారు. పోస్టునుబట్టి రూ.18 వేల నుంచి గరిష్ఠంగా రూ.34 వేలకుపైగా వేతనం ఇస్తారు. ఇందుకు అర్హత కలిగిన వారంతా తమ దరఖాస్తులను ఆన్‌లైన్‌లో సమర్పించాలి. apkgbv.apcsff.in వెబ్‌సైట్‌లో ఈ నెల 10వ తేదీ వరకు దరఖాస్తు చేసుకునే అవకాశముంది. వెబ్‌సైట్‌లో విద్యార్హతలు, వయసు గడువు తదితర వివరాలు ఉంటాయి.

ఏ పోస్టులు ఎన్ని ఖాళీలు

- నంద్యాల జిల్లాలో బోధన ఉపాధ్యాయులకు సంబంధించి పీఈటీ 1, సీఆర్టీ గణితం 1, సీఆర్టీ భౌతికశాస్త్రం 2, పీజీటీ వృక్షశాస్త్రం 1, పార్ట్ టైమ్ టీచర్ 19, బోధనేతర విషయంలో అకౌంటెంట్లు 2, వార్డెన్లు 5 పోస్టులు భర్తీ చేయనున్నారు.
- కర్నూలు జిల్లాలో పీఈటీ 1, సీఆర్టీ తెలుగు 1, హిందీ 3, పీఎస్ 5, ఎన్ఎస్ 3, సోషియల్ 2, పీజీటీలో ఆంగ్లం 1, గణితం 1, భౌతిక శాస్త్రం 1, రసాయనశాస్త్రం 1, వృక్షశాస్త్రం 2, ఎంపీహెచ్‌డబ్ల్యూ 4, ఎంఎల్‌టీ 1, జీఎఫ్‌సీ 4, పార్ట్‌టైమ్ టీచర్ 16, బోధనేతర కింద వార్డెన్లు 6 పోస్టులు భర్తీ చేయనున్నారు.

శాశ్వత లోక్‌అదాలత్‌లో రుణ వివాదం పరిష్కారం

కర్నూలు న్యాయవిభాగం, న్యూస్‌టుడే: వాహన రుణానికి సంబంధించిన వివాదాన్ని శాశ్వత లోక్‌అదాలత్ బుధవారం పరిష్కరించింది. కర్నూలుకు చెందిన నారాయణరెడ్డి గాయత్రీ ఎస్టేట్‌లోని శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్‌కో లిమిటెడ్‌లో రూ.6.20 లక్షలు రుణం పొంది ఎర్టిగా స్మార్ట్ హైబ్రిడ్ వీడీఐ కారును కొనుగోలు చేశారు. రుణ మొత్తాన్ని గడువుకు ముందే చెల్లించారు. క్లియరెన్సు సర్టిఫికెట్ జారీ చేయాలని, ఆర్సీలో హైపోథికేషన్ ఎండార్స్‌మెంట్‌ను తొలగించాలని నారాయణరెడ్డి కోరారు. సంస్థ నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో ఆయన శాశ్వత లోక్‌అదాలత్‌ను ఆశ్రయించారు. ఇరువురి వాదనలు విన్న శాశ్వత లోక్‌అదాలత్ అధ్యక్షుడు వెంకటహరినాథ్, సభ్యులు శివశంకర్‌రెడ్డి, డి.రాజుబాబు ప్రతివాదైన సంస్థ నిర్లక్ష్యంగా వ్యవరించినట్లు గుర్తించి సేవా లోపంగా పరిగణిస్తూ నారాయణరెడ్డికి రూ.10 వేలు చెల్లించాలని ఆదేశించారు.

సాగునీటి సంఘాల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించండి


మాట్లాడుతున్న కర్నూలు పార్లమెంట్ అధ్యక్షుడు పాలకుర్తి తిక్కారెడ్డి, మాజీ మంత్రి కేఈ ప్రభాకర్, జనసేన ఉమ్మడి జిల్లా సమన్వయకర్త సురేష్‌బాబు

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: సాగునీటి సంఘాల ఎన్నికలకు ప్రకటన వెలువడినందున ఉమ్మడి కర్నూలు జిల్లాల్లోని కేసీ కాల్వ, తుంగభద్ర ఎల్లెల్సీ, హంద్రీనీవా నీటి సంఘాలకు ఎన్నికలు జరుగుతున్నాయని, తెదేపా, భాజపా, జనసేనల తరపున పోటీ చేస్తున్న అభ్యర్థులను గెలిపించాలని కర్నూలు పార్లమెంట్ తెదేపా అధ్యక్షుడు పాలకుర్తి తిక్కారెడ్డి, మాజీ మంత్రి కేఈ ప్రభాకర్, జనసేన ఉమ్మడి జిల్లా సమన్వయకర్త సురేష్ బాబు కోరారు. బుధవారం తెదేపా జిల్లా కార్యాలయంలో వారు విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత అభివృద్ధి-సంక్షేమం రెండు సమదృష్టితో ముందుకు తీసుకెళ్తున్నారన్నాఉ. అందువల్లనే రాష్ట్రంలోని ప్రజలు కూటమి ప్రభుత్వానికి తమ పూర్తి మద్దతు తెలుపుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత జరిగిన అభివృద్ధిని చూసి ఇప్పటికే గ్రామాల్లో తెదేపాలో చేరికలు మొదలయ్యాయని, త్వరలో ఆదోనిలో నిర్వహించనున్న కార్తిక మహోత్సవానికి గౌడ సోదరులు 10 వేల మందికిపైగా హాజరయ్యేలా కార్యక్రమం ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. మంత్రాలయం నియోజకవర్గం నుంచి కొన్ని గ్రామాలకు చెందిన గౌడ సోదరులు తెదేపాలో చేరారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు నాగేంద్ర, కేఈ జగదీశ్, ఎల్వీ ప్రసాద్ పాల్గొన్నారు.

పథకం.. ఫలప్రదం

- పండ్లు, పూల తోటల పెంపకానికి చేయూత
- ఉద్యాన సాగు విస్తీర్ణం పెంచేలా ప్రభుత్వం చర్యలు


మామిడి సాగు

కల్లూరు గ్రామీణ, న్యూస్‌టుడే : ఉద్యాన పంటల సాగుకు కూటమి ప్రభుత్వం చేయూతనిస్తోంది. సాగు పెంచేలా చర్యలు తీసుకుంటోంది. గత వైకాపా ప్రభుత్వం ఉద్యాన పంటలను నిర్లక్ష్యం చేసింది. రాయితీ బకాయిలు చెల్లించడంలో నిర్లక్ష్యం చేసింది. ప్రస్తుత ప్రభుత్వం బకాయిలు చెల్లించడంతోపాటు కొత్తగా తోటల పెంపకం, పంట నిల్వ సౌకర్యాలు, ఫారం పాండ్స్ తదితరాలన్నీ పునరుద్ధరించాలని నిర్ణయించింది. దీనికి అనుగుణంగా 2024-25 కార్యాచరణ ప్రణాళిక రూపొందించింది.

17 రకాలకు సాయం

ఉమ్మడి కర్నూలు జిల్లాలో చాలామంది రైతులు మామిడి, జామ, సపోటా, కొబ్బరి, స్వీట్ ఆరెంజ్, నేరేడు, దానిమ్మ వంటి ఉద్యాన పంటలనే ఎక్కువగా సాగు చేస్తున్నారు. ఎక్కువ ఆదాయం తెచ్చిపెట్టే పంటలున్నా పెట్టుబడి పెట్టేందుకు వెనకడుగు వేస్తున్నారు. ఈ నేపథ్యంలో అలాంటి వారికి ఉపాధిహామీ పథకం ద్వారా రాయితీ అందించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. దాదాపు 17 రకాల పంటలకు మూడేళ్ల పాటు పెట్టుబడి సాయం అందించనుంది. అయిదెకరాల కంటే తక్కువ భూమి ఉన్న ఉద్యాన రైతులకు పెట్టుబడి సాయం అందుతుంది. జాబ్ కార్డు కలిగి ఉండాలి. భూమి చదును చేయడం నుంచి మొక్కలు నాటేందుకు గోతులు తీయడం, నీరు పోయడం, ఎరువులు తదితర సంరక్షణ చర్యలకుగాను రైతు ఖాతాకు నేరుగా సొమ్ము జమ చేస్తారు. ఈ నేపథ్యంలో వివిధ ఉద్యాన పంటల సాగుకు ఎక్కువమంది రైతులు మొగ్గు చూపుతున్నారు.

గత ప్రభుత్వం నిర్లక్ష్యం

గత వైకాపా ప్రభుత్వ హయాంలో రాయితీ నిధులు విడుదల కాలేదు. ఫలితంగా కొత్తగా పండ్ల తోటల సాగుకు రైతులు ఆసక్తి చూపలేదు. 2023-2024లో కర్నూలు జిల్లాలో 4,700 ఎకరాల్లో ఉద్యాన పంటలు సాగు చేసేలా లక్ష్యం విధించినప్పటికీ ఆశించిన ఫలితాలు రాలేదు. రైతులు ముందుగా వంద శాతం పెట్టుబడి పెట్టి పండ్ల తోటలు సాగు చేస్తారు. అందుకు అవసరమైన శాశ్వత పందిళ్లు, ఫారం పాండ్స్, ప్యాక్‌హౌస్‌లు వంటివి నిర్మిస్తారు. రాయితీ కోసం దరఖాస్తు చేశాక ఉద్యాన శాఖ అధికారులు పరిశీలించి మార్గదర్శకాల ప్రకారం ఎంత రాయితీ వర్తిస్తుందో అంత చెల్లిస్తారు. వైకాపా పాలకులు మాత్రం ఏ సంవత్సరంలోనూ పూర్తిస్థాయిలో రాయితీలు చెల్లించలేదని రైతులు పేర్కొంటున్నారు. అడపాదడపా వచ్చిన నిధులను సైతం ప్రజాప్రతినిధుల సిఫార్సులతో తమ అనుయాయులకే ఇచ్చుకున్నారు.

నమోదు పూర్తి

ఈ ఏడాది కర్నూలు జిల్లా పరిధిలో 5 వేల ఎకరాల్లో ఉద్యాన పంటలు సాగు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇప్పటికే అర్హులైన రైతులను గుర్తించి నమోదు ప్రక్రియ పూర్తి చేశారు. కర్నూలు జిల్లా వ్యాప్తంగా ప్రస్తుతం 3,200 ఎకరాల్లో ఉద్యాన పంటలు సాగు చేస్తున్నారు.

వివిధ పంటలకు మూడేళ్లలో అందించే సాయం వివరాలు (రూ.లలో)

రకం	మొక్కలు (ఎకరా)	సాయం
మామిడి	70	1,09,950
స్వీట్ ఆరెంజ్	100	1,37,750
చీనీ	110	1,46,311
జామ	110	1,46,971
తైవాన్ జామ	444	2,51,224
సపోటా	60	95,584
కొబ్బరి	60	99,183
నేరేడు	40	68,163
చింత	40	68,403
సీతాఫలం	240	2,14,178
దానిమ్మ	267	2,16,417
అంజూర	310	1,67,324
డ్రాగన్ ఫ్రూట్	225	2,00714
ఆపిల్ బేర్	320	1,26,186
రోజా తోట	500	62,355
మల్లె	400	55,124
మునగ	112	27,515

కర్నూలు డివిజనల్ డీఎల్‌సీవోగా షేక్ జాఫ్రిన్

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: ఆదోని డివిజనల్ కోఆపరేటివ్ అధికారిణి (డీఎల్‌సీవో) షేక్ జాఫ్రిన్‌ను కర్నూలు డివిజనల్ సహకార అధికారిణిగా నియమిస్తూ సహకార శాఖ కమిషనర్ బాబు ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా కోఆపరేటివ్ ఆడిట్ అధికారిణి (డీసీఏవో) శిరీషను ఆదోని డివిజనల్ కోఆపరేటివ్ అధికారిణిగా ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించారు. షేక్ జాఫ్రిన్ నవంబరు 1 నుంచి 15 వరకు ఏషియన్ పసిఫిక్ డెఫ్ గేమ్స్‌లో పాల్గొనేందుకు కమిషనర్ అనుమతిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

డ్వామా ఇన్‌ఛార్జి పీడీగా జడ్పీ సీఈవో

కల్లూరు గ్రామీణం, న్యూస్‌టుడే: కర్నూలు జిల్లా డ్వామా ఇన్‌ఛార్జి పీడీగా జడ్పీ సీఈవో నాసరరెడ్డిని నియమించారు. ఈ సందర్భంగా ఆయన బుధవారం బాధ్యతలు చేపట్టారు. కార్యాలయ అధికారులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

15,882 క్యూసెక్కులు విడుదల

గూడూరు న్యూస్‌టుడే: సుంకేసుల జలాశయం నుంచి దిగువకు 15,882 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు జలాశయ ఇంజినీరు రాజు బుధవారం తెలిపారు. ఎగువ నుంచి 15,885 క్యూసెక్కుల వరద నీరు వస్తోందని జలాశయంలో 1.235 టీఎంసీలు నిల్వ ఉండటంతో వచ్చిన నీళ్లన్నీ విడుదల చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ఉల్లి క్వింటాల్ గరిష్ఠ ధర రూ.3,969

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: కర్నూలు వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం పంట ఉత్పత్తుల ధరల వివరాలు ఇలా ఉన్నాయి. మార్కెట్‌కు 10,968 క్వింటాళ్ల ఉల్లి ఉత్పత్తులు రాగా క్వింటాల్ కనిష్ఠ ధర రూ.497, మధ్యస్థం రూ.2,465, గరిష్ఠం రూ.3,969 పలికింది. వేరుశనగకాయలు క్వింటాల్ రూ.6,786, పూల విత్తనాలు రూ.5,929, ఆముదాలు రూ.5,936, మొక్కజొన్నలు రూ.2,239, కందులు రూ.9,741, శనగలు రూ.3,509, ఎండుమిర్చి 11,208, కొర్రలు రూ.3,119, మినుములు రూ.8,391, సజ్జలు రూ.2,146కు వ్యాపారులు కొనుగోలు చేశారు.

ఆసనాల విన్యాసం.. పతకాల కైవసం

- రాష్ట్ర, జాతీయస్థాయి పోటీలకు ఎంపిక
- ఆస్పరి కస్తూర్బా బాలికల ప్రతిభ


ధ్యానంలో కస్తూర్బా పాఠశాల విద్యార్థినులు

ఆస్పరి, న్యూస్‌టుడే: ఆసనాలు నిత్యం సాధన చేస్తారు.. ఆరోగ్యంతో పాటు చదువుపై ఏకాగ్రత పెరుగుతుంది. బాలికలు యోగా సాధనలో ఆసక్తి కనబరుస్తున్నారు. పాఠశాలల్లో విద్యతో పాటు ఆరోగ్య పరిక్షణ, శారీరక దృఢత్వం, మానసికోల్లాసానికి రోజూ యోగాసనాలపై శిక్షణ ఇస్తున్నారు. రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలో విజయాలు సాధిస్తున్నారు. ఆస్పరి కస్తూర్బా పాఠశాలలో ఆరు నుంచి ఇంటర్ వరకు సుమారు 270మంది విద్యార్థినులు చదువుతున్నారు. వీరికి విద్యతో పాటు క్రీడలు, వ్యాయామం, యోగా, ధ్యానంపై కూడా ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. పాఠశాల ప్రత్యేక అధికారిణి షారోన్ స్మైలీ, వ్యాయామ ఉపాధ్యాయిని రాజేశ్వరి ప్రత్యేక శిక్షణపై దృష్టిసారిస్తున్నారు. కస్తూర్బా విద్యార్థులు ప్రత్యేకంగా నిలుస్తున్నారు.


వృశ్చికాసనంలో..

ఇలా ఆచరిస్తారు..

ప్రతి రోజు తెల్లవారు జామున 4.30గంటలకే నిద్ర లేస్తారు. అర గంట పాటు చదువుతారు. 5.15 నుంచి 6 గంటల వరకు ప్రత్యేక యోగా శిక్షణ, 6 నుంచి 6.30వరకు ధ్యానం నేర్పిస్తారు. నాలుగేళ్లుగా బాలికలను సిద్ధం చేస్తున్నారు. ప్రత్యేక దినోత్సవాల్లో ఆసనాలు ప్రదర్శిస్తుంటారు. పోటీలు ఎక్కడ జరిగినా పాల్గొంటూ ప్రతిభ చాటుతున్నారు.

పల్లవించిన విజయాలు



ఆస్పరి మండలంలోని నగరూరు గ్రామానికి చెందిన పరమేష్, పద్మవతి దంపతుల కుమార్తె పల్లవి. కస్తూర్బా పాఠశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. తల్లిదండ్రులు వ్యవసా కూలీలు. 2021, 2022లో జరిగిన యోగాసనాల్లో పోటీల్లో జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది. 2023లో రాష్ట్ర స్థాయి పోటీల్లో సత్తాచాటి.. కోల్‌కతాలో జరిగిన జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. అక్కడ రన్నర్‌గా నిలిచింది. పట్టు వదలకుండా సాధన చేసి 2024లో జిల్లా స్థాయిలో గెలిచి ఇటీవల విశాఖపట్నంలో భీమిలిలో రాష్ట్ర స్థాయిపోటీల్లో సత్తా చాటి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. జాతీయ స్థాయిలో తప్పక విజయంసాధిస్తానని చెబుతోంది పల్లవి. ఇంటర్ ప్రథమ సంవత్సరంలోనూ ఉత్తమ ఫలితాలు సాధించినట్లు ఉపాధ్యాయినులు తెలిపారు.

క్రమశిక్షణ, ఆరోగ్య రక్షణ



- రాజేశ్వరి, వ్యాయమ ఉపాధ్యాయిని, కస్తుర్బా పాఠశాల

విద్యార్థినులకు యోగాతో మానసికోల్లాసంతో పాటు ఆరోగ్యం, ఏకాగ్రత, క్రమశిక్షణ, ఆరోగ్యం దరిచేరుతాయి. యోగా, ధ్యానంతోనే రోగాలు దరిచేరవు. ఆసనాలతో మనస్సు, శరీరం మన ఆధీనంలో ఉంటాయి. విద్యార్థులు ఆసక్తిగా సాధన చేస్తూ.. రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు ఎంపికవుతున్నారు. ఈ ఏడాది మొత్తం ఐదుగురు విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో రాణించారు. పల్లవి జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కాగా మిగిలిన నలుగురు ఉషారాణి, భూమిక, శ్యామల, శ్రుతి రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొని రన్నర్స్‌గా నిలిచారు.

విద్యతో పాటు వ్యాయామం



- షారోన్ స్మైలీ, పాఠశాల ప్రత్యేక అధికారిణి

కస్తూర్బా పాఠశాల విద్యార్థినులకు విద్యతో పాటు వ్యాయమంలో భాగంగానే ఆటలు, యోగా, ధ్యానం నేర్పుతున్నాం. ఉపాధ్యాయులు చెప్పేపాఠాలు వెంటనే గ్రహించే శక్తి యోగాతో వస్తుంది. చదువులో ఉత్తమ ఫలితాలతో పాటు ఆటల్లో పతకాలు సాధిస్తున్నారు. రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించడం చాలా సంతోషంగా ఉంది. అందరినీ ప్రోత్సహిస్తున్నాం.

డీసీసీబీ అనుమతి లేకుండా రూ.10 లక్షలు మళ్లింపు

- వెలుగోడు మేనేజర్ నారాయణరెడ్డిపై సస్పెన్షన్ వేటు

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: వెలుగోడు సహకార బ్రాంచి మేనేజర్ నారాయణరెడ్డిపై సస్పెన్షన్ వేటు వేశారు. వెలుగోడు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘానికి మల్టీ సర్వీసెస్ సెంటర్ కింద ఉమ్మడి కర్నూలు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు రూ.10 లక్షలు మంజూరు చేసింది. అయితే బ్రాంచి మేనేజర్ నారాయణరెడ్డి ఉదారంగా డీసీసీబీ అనుమతి లేకుండా స్వీయ నిర్ణయాధికారంతో మరో రూ.10 లక్షలు సొసైటీకి మంజూరు చేశారు. గత మార్చిలో వెలుగోడు సొసైటీకి రూ.10 లక్షలు మంజూరు చేసినప్పటికీ, జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ప్రధాన కార్యాలయానికి సమాచారం ఇవ్వలేదు. ఆరు నెలలు గడిచినా సమాచారం ఇవ్వకుండా దాచిపెట్టిన బ్రాంచి మేనేజర్‌పై బ్యాంకు అధికారులు సస్పెన్షన్ వేటు వేశారు. 5-6 ఏళ్లకుపైగా వెలుగోడు బ్రాంచిలో తిష్ట వేసిన మేనేజర్‌ను ఇటీవల బనగానపల్లి బ్రాంచికి బదిలీ చేసిప్పటికీ పది రోజులైనా రిలీవ్ కాలేదు. ఆరేళ్ల కాలంలో కేవలం మూడు నెలలు మాత్రమే బనగానపల్లి బ్రాంచిలో పని చేసి మళ్లీ రాజకీయ పలుకుబడితో వెలుగోడు బ్రాంచికే వచ్చారు. ఇటీవల ఆత్మకూరు సహకార బ్రాంచిలో క్యాషియర్ రూ.78.77 లక్షలు స్వాహా చేసిన ఘటన మరువకముందే వెలుగోడు బ్రాంచిలో మరో రూ.10 లక్షల బాగోతం వెలుగులోకి వచ్చింది. ఉమ్మడి కర్నూలు జిల్లా సహకార బ్యాంకు అధికారులు బ్యాంకు బ్రాంచీలపై పర్యవేక్షణ లోపం వల్లే బ్రాంచి మేనేజర్లు, సిబ్బంది పలు అక్రమాలకు పాల్పడుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

టెట్‌కు 304 మంది గైర్హాజరు

కర్నూలు విద్య, న్యూస్‌టుడే: టెట్ పరీక్షకు 304 మంది అభ్యర్థులు గైర్హాజరైనట్లు ఇన్‌ఛార్జి డీఈవో శ్రీనివాసులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం సెషన్‌లో 1,611 మందికిగాను 1,472 మంది, మధ్యాహ్న సెషన్ 1,613 మందికిగాను 1,448 మంది అభ్యర్థులు పరీక్ష రాశారన్నారు.

వంద రోజుల ప్రణాళిక లక్ష్యాలు సాధించాలి: కలెక్టర్

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: వచ్చే డిసెంబరు 31 నాటికి రెండో దశ వంద రోజుల ప్రణాళిక లక్ష్యాలను సాధించాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన కలెక్టరేట్ సమావేశ మందిరంలో వంద రోజుల లక్ష్యాలపై (రెండో దశ) జిల్లా స్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించి మాట్లాడారు. అన్ని శాఖలు రెండో దశ వంద రోజుల లక్ష్యాల సాధనలో వెనుకబడకూడదన్నారు. వ్యవసాయ శాఖ ప్రణాళికలో రబీ సీజన్ విత్తన పంపిణీ, పొలం పిలుస్తోంది తదితర కార్యక్రమాలను లక్ష్యాల మేరకు పూర్తి చేయాలని డీఏవోను ఆదేశించారు. 95 కిచెన్ గార్డెన్స్, 50 స్కూల్ న్యూట్రీగార్డెన్స్‌ను కూడా పూర్తి చేయాలన్నారు. పట్టు పరిశ్రమశాఖకు సంబంధించి 12 ఎకరాల్లో మల్బరీ ప్లాంటేషన్, కిసాన్ నర్సరీ పెంపకం, బైవోల్టెన్ కకూన్స్ హార్వెస్టింగ్ తదితర కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. పశుసంవర్ధక శాఖకు సంబంధించి ఉపాధి హామీ పథకం కింద చేపడుతున్న 1,200 గోకులం షెడ్లు వంద రోజుల్లో గ్రౌండింగ్ చేయాలని డ్వామా అధికారులను ఆదేశించారు. పరిశ్రమలశాఖకు సంబంధించి 300 ఎంఎస్ఎంఈలను ఏర్పాటు చేయాలని ఆ శాఖ అధికారులను, సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకం ఎక్కువ మంది విద్యుత్తు వినియోగదారులను గుర్తించాలని, పుచ్చకాయలమడ గ్రామంలో ఆరుగురికి సోలార్ విద్యుత్తు అందించేందుకు చర్యలు తీసుకోవాలని ఎస్ఈని ఆదేశించారు. ఉపాధి పథకం, అటవీశాఖ కన్వర్జెన్సీతో చేపట్టే కార్యక్రమాలను వంద రోజుల లక్ష్యాల్లో చేర్చాలన్నారు. రవాణాశాఖకు సంబంధించి చిన్నటేకూరు గ్రామం వద్ద ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్ నిర్వహణపై కలెక్టర్ ఆరా తీశారు. తుగ్గలి గిరిజన సంక్షేమ పాఠశాలకు రూ.4.5 లక్షలతో ప్రహరీ మంజూరు చేశామని, త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. కర్నూలు నగర పాలక సంస్థలో ప్రధాన రహదారుల్లో గుంతలు ఉన్నాయని, వాటికి ప్యాచ్‌వర్క్‌లను కూడా లక్ష్యంలో చేర్చాలన్నారు. పంచాయతీరాజ్‌కు సంబంధించి రూ.52 కోట్లతో పల్లె పండగ ద్వారా చేపడుతున్న 70 కి.మీ. సీసీ రహదారులను సంక్రాంతిలోపు పూర్తి చేయాలన్నారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను త్వరితగతిన వినియోగంలోకి తీసుకురావాలన్నారు. డిసెంబరు 31 నాటికి 4,672 ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలన్నారు. ఈ నెల 14 నుంచి 20 వరకు పల్లె పండగను విజయవంతం చేయాలన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ పి.రంజిత్ బాషా

సీఎం హామీలు నెరవేరేలా చూడాలి

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: పత్తికొండ మండలం పుచ్చకాయలమడలో ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ఇచ్చిన హామీలను నెరవేర్చేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వంద రోజుల లక్ష్యాల సాధనతోపాటు పుచ్చకాయలమడలో సీఎం హామీల సాధనపై కూడా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. హౌసింగ్‌కు సంబంధించి 203 దరఖాస్తులు వచ్చాయని, వీటిని మంజూరు చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. మరో 40 మందికి ఇళ్ల స్థలాలు మంజూరుకు కూడా భూమిని గుర్తించాలని డీఆర్వోను ఆదేశించారు. ఎన్టీఆర్ భరోసా పింఛన్లకు 48 దరఖాస్తులు వచ్చాయని, వీటిని మంజూరు చేసేందుకు సెర్ప్ సీఈవోకు పంపాలని డీఆర్డీఏ పీడీకి, నూతన రేషన్ కార్డుల కోసం 15, రైస్‌కార్డుల విభజనకు 3 దరఖాస్తులు వచ్చాయని వాటిని పౌరసరఫరాలశాఖ కమిషనర్‌కు పంపాలని డీఎస్‌వోకు సూచించారు. జల్‌జీవన్ మిషన్ కింద కుళాయి కనెక్షన్లకు, టాయిలెట్లకు 105 దరఖాస్తులు వచ్చాయన్నారు.

నంద్యాల జిల్లాకు ఎస్ఈ నియామకం


నంద్యాల జిల్లా ఎస్ఈ జి.సుధాకర్‌కుమార్

కర్నూలు వెంకటరమణ కాలనీ, న్యూస్‌టుడే: రాష్ట్రంలో కొత్త జిల్లాల ఏర్పాటు తర్వాత కర్నూలు రెండు జిల్లాలుగా విడిపోయింది. అయితే విద్యుత్తు ఆపరేషన్ సర్కిల్ కార్యకలాపాలు మాత్రం కర్నూలు జిల్లా నుంచే నిర్వహిస్తున్నారు. కర్నూలు జిల్లా ఎస్ఈగా పని చేస్తున్న ఎం.ఉమాపతి రెండు జిల్లాలకు ఎస్ఈ ఆపరేషన్స్ కార్యకలాపాలు నిర్వర్తిస్తున్నారు. ప్రస్తుతం నంద్యాల జిల్లాకు ప్రత్యేక ఎస్ఈ కార్యాలయం ఏర్పాటు చేస్తూ అధికారులు, ఉద్యోగులను కేటాయిస్తూ గతంలో కార్పొరేట్ కార్యాలయం, తిరుపతి నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. నూతనంగా ఏర్పాడిన నంద్యాల జిల్లాకు కార్పొరేట్ కార్యాలయంలో విధులు నిర్వహించే జీఎం (ఎల్ఎంసీ, సీఎస్‌సీ అండ్ ఎస్ఎల్‌డీసీ) జి.సుధాకర్‌కుమార్‌ను నంద్యాల ఎస్ఈగా బదిలీ చేస్తూ సీఎండీ సంతోషరావు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. కర్నూలు జిల్లాలో ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న ఎస్ఈ ఎం.ఉమాపతిని కొనసాగిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. నంద్యాల పట్టణ డివిజన్ కార్యాలయంలో ఎస్ఈ కార్యాలయం ఏర్పాటు చేసి, అక్కడి నుంచే నంద్యాల జిల్లా ఎస్ఈ (ఆపరేషన్స్) కార్యకలాపాలు నిర్వహించేలా ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. నంద్యాల జిల్లా సర్కిల్ కార్యాలయానికి ఈఈలు, ఏడీఈలు, ఏఈలు, అకౌంట్స్ అధికారులు, ఇతర సిబ్బందిని కేటాయించాల్సి ఉంది.

నిత్యం 50వేల మందికి ఉపాధి: పీడీ

కర్నూలు నగరం (జడ్పీ), న్యూస్‌టుడే: ఉపాధి హామీ పథకం లక్ష్యం చేరుకోవాలని, ఏ మాత్రం నిర్లక్ష్యం వహించకూడదని జడ్పీ సీఈవో, ఇన్‌ఛార్జి డ్వామా పీడీ నాసరరెడ్డి ఆదేశించారు. జడ్పీలోని తన ఛాంబరులో జిల్లాలోని ఏపీడీలు, ఏపీవోలతో బుధవారం సాయంత్రం సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఉపాధి హామీ ద్వారా ఫారం పాండ్లను ఏర్పాటు చేయడం ద్వారా భూగర్భజలాలు అభివృద్ధి అవుతాయని, ఈ మేరకు దృష్టి సారించాలన్నారు. జిల్లాలో ప్రతిరోజూ 50 వేల మందికి ఉపాధి కల్పించాలని, రోజుకు రూ.300 వేతనం ఇవ్వాలన్నారు. ఉపాధి కూలీలకు 100 రోజులు పనిదినాలు కల్పించాలన్నారు. ఈ నెల 14 నుంచి 21 తేదీ వరకు నిర్వహించే పల్లె పండగను విజయవంతం చేయాలన్నారు. జిల్లాలో 5 వేల ఎకరాల్లో పండ్ల తోటల పెంపకం లక్ష్యం పూర్తి చేయాలన్నారు.


ఏపీడీ, ఏపీవోలతో సమావేశమైన జడ్పీ సీఈవో నాసరరెడ్డి

బన్ని ఉత్సవానికి భారీ బందోబస్తు: ఎస్పీ

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే: దసరా పండగను పురస్కరించుకుని దేవరగట్టు మాళమల్లేశ్వర స్వామి బన్ని ఉత్సవంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా 800 మంది పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని జిల్లా ఎస్పీ జి.బిందుమాధవ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏడుగురు డీఎస్పీలు, 42 మంది సీఐలు, 54 మంది ఎస్సైలు, 112 మంది ఏఎస్సైలు, హెడ్‌కానిస్టేబుళ్లు, 362 మంది కానిస్టేబుళ్లు, 50 మంది స్పెషల్ పార్టీ పోలీసులు, మూడు ప్లాటూన్ల ఏఆర్ పోలీసులు, 95 మంది హోంగార్డులను కేటాయించామన్నారు. బన్ని ఉత్సవంలో అల్లర్లకు పాల్పడటం, నిప్పులు విసరటం వంటి హింసాత్మక ఘటనలకు పాల్పడి శాంతిభద్రతలకు విఘాతం కల్గిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సమీప గ్రామాలైన నెరవణి, కొత్తపేట, ఆరికెర, ఎల్లార్తిలో రెవెన్యూ శాఖలతో కలిసి అవగాహన సదస్సులు నిర్వహించామన్నారు. చెక్‌పోస్టులను ఏర్పాటు చేయటంతోపాటు నాకాబందీ నిర్వహించి నాటుసారా, అక్రమ మద్యం కట్టడికి చర్యలు తీసుకుంటామన్నారు. 148 మందిని బైండోవర్ చేశామన్నారు. కర్రల సమరానికి ప్రజలు స్వస్తి పలకాలని, పండగ ప్రశాంతంగా జరుపుకోవాలని విజ్ఞప్తి చేశారు.

రాజకీయ సమస్యలుంటే మా దృష్టికి తీసుకురండి: మంత్రి

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే: మద్యం దుకాణ అనుమతుల దరఖాస్తుల నమోదు విషయంలో రాజకీయ ఇబ్బందులు ఏవైనా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని రాష్ట్ర మద్య నిషేధ, ఆబ్కారీ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర ఆదేశించారు. బుధవారం రాత్రి ఆయనతోపాటు కార్యదర్శి ముఖేష్‌కుమార్ మీనా, కమిషనర్ నిశాంత్ కుమార్ విజయవాడ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టరేట్ నుంచి డిప్యూటీ కమిషనర్ శ్రీదేవి, అసిస్టెంట్ కమిషనర్ హనుమంతరావు, పర్యవేక్షణాధికారి సుధీర్‌బాబు హాజరయ్యారు. ఎక్కడా సిండికేట్లు ఏర్పడటానికి వీల్లేదని, ఇందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. అనుమతిదారులకు మద్యం విక్రయాలపై 20 శాతం మార్జిన్ ఇచ్చే అంశంపై బాగా ప్రచారం చేసి అవగాహన కల్గించాలని, ఏ రాష్ట్రంలో ఇంత మార్జిన్ ఇవ్వని విషయాన్ని తెలియజేయాలన్నారు. మరో రెండు రోజులు గడువు పొడిగించిన నేపథ్యంలో అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని వీలైనన్ని ఎక్కువ దరఖాస్తులు నమోదు చేయించాలన్నారు. సహాయ పర్యవేక్షణాధికారి రామకృష్ణారెడ్డి, సీఐ చంద్రహాస్, రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.


కాన్ఫరెన్సులో డీసీ శ్రీదేవి, అసిస్టెంట్ కమిషనర్ హనుమంతరావు

24 మందిపై మరో కేసు

ఆలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: పవన విద్యుత్తు కార్యాలయాలపై దాడులు చేసి, సామగ్రి ధ్వంసం చేసిన ఘటనపై దేవనకొండ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఇప్పటికే ఆలూరు మండలం మొలగవల్లిలో పవన విద్యుత్తు కార్యాలయంపై దాడికేసులో 24 మంది రిమాండులో ఉన్నారు. ఆ నిందితులను బుధవారం ప్రత్యేక వాహనంలో పత్తికొండ కోర్టుకు తీసుకెళ్లారు. పత్తికొండ న్యాయమూర్తి ఎదుట హాజరు పరుచగా.. 14 రోజుల పాటు రిమాండ్‌కు ఆదేశించినట్లు పోలీసులు తెలిపారు. ఆలూరు, ఆస్పరి పోలీస్ స్టేషన్లలో ఒక్కో కేసు నమోదైంది. ఈ దాడుల్లో ప్రధానంగా ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి సోదరుడు వెంకటేశ్వర్లుతో పాటు దేవనకొండ జడ్పీటీసీ సభ్యుడు కిట్టు అలియాస్ రామకృష్ణ, బిణిగేరి సర్పంచి వెంకటేష్, తదితరులు ఉన్నారు.

ఆదోని

• ఆదోని • ఆలూరు • పత్తికొండ



సబ్ కలెక్టర్‌ను కలిసిన పత్తికొండ ఆర్డీవో

ఆదోని గ్రామీణం న్యూస్‌టుడే: ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో బుధవారం సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌ను పత్తికొండ నూతన ఆర్డీవో భరత్ నాయక్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మొక్కను అందజేశారు. రెవెన్యూ సమస్యలపై చర్చించారు. దేవరగట్టు జైత్రయాత్ర ఏర్పాట్లు, నిర్వహణ ప్రణాళికపై మాట్లాడారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు.

మార్కెట్ యార్డుకు సెలవులు

ఆదోని మార్కెట్, న్యూస్‌టుడే: ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డుకు 10 నుంచి 12వ తేదీ వరకు దసరా సెలవులు ప్రకటించినట్లు యార్డు కార్యదర్శి రామ్మోహన్‌రెడ్డి బుధవారం తెలిపారు. యార్డులో పంట దిగుబడులు క్రయ, విక్రయాలు జరగవని, 13వ తేదీ ఆదివారం సెలవు, తిరిగి 14వ తేదీ సోమావారం యార్డులో వ్యాపారాలు ప్రారంభమవుతాయన్నారు. రైతులు గమనించాలని కోరారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
ఆదోని: 77996 66004
ఆలూరు: 80085 62277
పత్తికొండ: 8008573822

ఆదోని పురపాలకం, న్యూస్‌టుడే: సమస్య: ఆదోని పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలకు వెళ్లే ప్రధాన రహదారి పాత టీబీపీ కార్యాలయం ఎదుట చెత్త పేరుకుపోయింది. శుభ్రత పనులు చేయించాలి.
- చంద్రశేఖర్, ఆదోని

సమాధానం: ప్రజారోగ్య విభాగ సిబ్బంతో సమస్యను పరిష్కరిస్తాం. **- కృష్ణ, కమిషనర్, ఆదోని పురపాలక సంఘం**

ఆలూరు, న్యూస్‌టుడే: సమస్య: ఆలూరు కోటవీధిలోని చెన్నకేశవస్వామి ఆలయ సమీపంలో మురుగు రహదారిపై పారుతోంది. భక్తులు ఇబ్బందులు పడుతున్నారు.
- రాఘవేంద్ర, ఆలూరు

సమాధానం: పారిశుద్ధ్య సిబ్బందిని పంపి, మురుగు నిల్వ ఉండకుండా చూస్తాం. **- అరుణాదేవి, సర్పంచి, ఆలూరు**

ఆదోని ఎస్కేడీ కాలనీ, న్యూస్‌టుడే: సమస్య: ఆదోని పట్టణంలోని కొత్త బస్టాండు ప్రధాన రహదారిపై కొన్ని నెలల కిందట ప్రైవేటు టెలికాం సంస్థ వారు గోతులు తవ్వారు. పూడ్చకుండా వదిలేశారు. ప్రమాదకరంగా మారింది. **- కాలనీవాసులు, ఆదోని**

సమాధానం: క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం.
- కృష్ణ, కమిషనర్, ఆదోని పురపాలక సంఘం

హొళగుంద, న్యూస్‌టుడే: సమస్య: స్థానిక ప్రధాన రహదారిలో విద్యుత్తు ఉప కేంద్రం ఎదుట చెత్తాచెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలతో పరిసరాలంతా అపరిశుభ్రంగా మారింది. శుభ్రం చేయించండి. **- రామాంజి, హొళగుంద**

సమాధానం: పారిశుద్ధ్య కార్మికులకు సూచించి, శుభ్రం చేయిస్తాం. **- రాజశేఖర్‌గౌడ, పంచాయతీ కార్యదర్శి, హొళగుంద**

ఛైర్‌పర్సన్ భర్త భాజపాలో చేరిక



పురపాలక కబుర్లు


ఆదోని మార్కెట్, న్యూస్‌టుడే: ఆదోని పురపాలక సంఘం ఛైర్‌పర్సన్(వైకాపా) భర్త నాగేంద్ర అనుచరగణంతో బుధవారం భాజపాలో చేరారు. ఎమ్మెల్యే డా.పార్థసారథి నాగేంద్రకు పార్టీ కండువా వేసి స్వాగతం పలికారు.

ఆదోని పురపాలకం, న్యూస్‌టుడే: ఆదోని పట్టణం 13వ వార్డులోని కార్వన్‌పేటలో పురపాలక సంఘం కమిషనర్ కృష్ణ బుధవారం పర్యటించారు. వార్డులో ప్రజారోగ్య పనులను పరిశీలించారు. ప్రజలతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. దోమల నివారణకు చేపట్టాల్సిన అంశాలను వార్డు వాసులకు వివరించారు.

ఆదోని పాతపట్టణం, న్యూస్‌టుడే: ఆదోని పట్టణంలో తన వార్డు పరిధిలో జరిగే అధికారిక కార్యక్రమాలకు తనను ఆహ్వానించడంలేదని 35వ వార్డు కౌన్సిలరు లలితా మధుసూదన్‌శర్మ బుధవారం తెలిపారు. ఇటీవల మార్కెట్ యార్డులో రైతు భోజనం పథకం కార్యక్రమానికి పిలుపులేదన్నారు. తాజాగా.. యార్డులో జరిగిన రైతు సదస్సుకూ ఆహ్వానం లేదన్నారు. ప్రభుత్వం మారినా.. అధికారుల్లో మాత్రం మార్పు కనిపించడంలేదని, దీనిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తానన్నారు.

ఆదోని ఎస్కేడీ కాలనీ, న్యూస్‌టుడే: ఆదోని పట్టణం విజయనగర్ కాలనీలో వర్షం కారణంగా రహదారులు జలమయం అవుతున్నాయి. కాలనీకి చెందిన యువత ఆదోని తెలుగు యువ నాయకుడు మారుతినాయుడు దృష్టికి తీసుకెళ్లారు. ఆయన స్పందించి కాలనీలోని రహదారులను చదును చేయించి గ్రావెల్ వేయించారు. తెదేపా నాయకులు అమర్‌ప్రకాశ్, కృష్ణ, విజయ్, రసూల, కాశీం, నాగరాజు, కాశీ మురగేశ్ తదితరులు కృతజ్ఞతలు తెలిపారు.

పల్లెకు పండగొచ్చింది



ఐదేళ్ల అసౌకర్యాలతో సతమతమయ్యారు. గోతుల దారుల్లో ప్రయాణించలేక నానా అవస్థలు పడ్డారు. అడుగడుగునా యమగండాలు దాటాడారు. రాకపోకలు సాగించాలంటే.. రోజూ సాహసమే. రహదారుల ఆనవాళ్లు లేకుండా పోయాయి. చిన్నపాటి వర్షం కురిసినా.. దారులు దారుణంగమా మారుతున్నాయి. మురుగు నీరంతా రహదారులపైకి చేరుతోంది. మురుగు పారేందుకు కాల్వల నిర్మాణం మరిచారు. ఇలాంటి సమస్యలు తప్పించేందుకు కూటమి ప్రభుత్వం 'పల్లెకు పండగ' తెస్తోంది.
– న్యూస్‌టుడే, ఆదోని గ్రామీణం

కూటమి ప్రభుత్వం ఏర్పడిన వందరోజుల్లో గ్రామీణ రహదారులకు మహర్దశ తెచ్చింది. వైకాపా ఐదేళ్ల పాలనలో గ్రామీణ అంతర్గత, ప్రధాన రహదారులు పూర్తిగా దెబ్బతిని అధ్వానంగా మారాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదేశాల మేరకు గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి, దెబ్బతిన్న రహదారులను నిర్మాణాలు చేపట్టాలని నిర్ణయించారు.

☛ ఆదోని డివిజన్‌లో రూ.29.42 కోట్లతో అభివృద్ధి పనులు
☛ గ్రామీణ రహదారులకు మహర్దశ

గ్రామాలకు ప్రగతి దారులు

ఆదోని డివిజన్‌కు జాతీయ గ్రామీణ ఉపాధి పథకం కింద రహదారుల నిర్మాణానికి 418 పనులు మంజూరయ్యాయి. ఈ పనుల కోసం రూ.29.42 కోట్లు కేటాయించారు. పూర్తిగా రహదారి వసతి లేని గ్రామాలకు 25 పనులు మంజూరయ్యాయి. వీటి కోసం రూ15.5 కోట్లు కేటాయించారు. ప్రభుత్వం ఈ నెల 14 నుంచి 21వ తేదీ వరకు పల్లె పండగ వారోత్సవాల కార్యక్రమం చేపట్టనుంది. ప్రతి గ్రామంలో సిమెంటు రహదారుల నిర్మాణాలకు ప్రజాప్రతినిధులు శంకుస్థాపన కార్యక్రమాలు చేపట్టనున్నారు. ఇందు కోసం పంచాయతీ రాజ్ శాఖ అధికారులు, మండల పరిషత్ అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు. వీటితో పాటు దెబ్బతిన్న రహదారులకు కూడా మరమ్మతులు చేపట్టనున్నారు.

అందరూ భాగస్వాములు కావాలి

– డీసీ వెంకటేశ్, పంచాయతీరాజ్ ఈఈ, ఆదోని



ప్రభుత్వం ఈనెల 14 నుంచి 21వ తేదీ వరకు గ్రామాల్లో పల్లె పండగ కార్యక్రమం నిర్వహించేందుకు చర్యలు చేపట్టింది. అందరూ భాగస్వాములు కావాలి. ఆదోని, ఎమ్మిగనూరు, మంత్రాలయం, ఆలూరు నియోజకవర్గాల్లో 418 పనులు మంజూరయ్యాయిజ ఇందుకు రూ.29.42 కోట్లు మంజురయ్యాయి. ఎమ్మెల్యేలు సిమెంటు రహదారుల నిర్మాణాలకు భూమి పూజ చేస్తారు.

ప్రగతి అడుగులు



మొలగవల్లి (ఆలూరు), న్యూస్‌టుడే: మొలగవల్లి గ్రామంలోని ఎస్సీ కాలనీలో 15వ ఆర్థిక సంఘం నిధులతో రూ.2.50 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టారు. పల్లెలకు మంచి రోజులు రాబోతున్నాయని, అభివృద్ధి అడుగులు పడుతున్నాయని మొలగవల్లి సర్పంచి మోహన్‌రాజు అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి వంద రోజులు దాటగానే పల్లెల్లో అభివృద్ధి ప్రారంభమైందన్నారు. బుధవారం రహదారి పనులను పరిశీలించారు.

రహదారికి మరమ్మతులు

ఆలూరు, న్యూస్‌టుడే: ఆలూరు పట్టణంలోని జాతీయ రహదారి అధ్వానంగా మారడంతో మరమ్మతులు చేయించారు. పట్టణంలోని గ్రామీణ నీటి సరఫరా విభాగ కార్యాలయం నుంచి కొంత దూరం వరకు రహదారిపై గరుసు వేయించి గుంతలు లేకుండా చేశారు. దేవరగట్టు దసరా ఉత్సవాల సందర్భంగా పలు ప్రాంతాల నుంచి భక్తులు వస్తుంటారు. రహదారి కంకర తేలి, గుంతలు పడటంతో రాకపోకలు కొనసాగించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. భక్తులు, వాహనదారుల ఇబ్బందులు తొలగించేందుకు తాత్కాలిక పనులు చేపట్టినట్లు పంచాయతీ సర్పంచి అరుణాదేవి, తెదేపా జిల్లా అధికార ప్రతినిధి బెంగళూరు కిశోర్ తెలిపారు.



పంచాయతీ వారోత్సవాలు విజయవంతం చేయాలి

– అల్లాబకాష్, ఎంపీడీవో, చిప్పగిరి

చిప్పగిరి మండలంలో ఉపాధి హామీ పథకం ద్వారా రూ.1.80 కోట్లతో గ్రామ పంచాయతీల్లో పనులు చేపట్టనున్నారు. సీసీ రహదారులు, మురుగు కాల్వల నిర్మిస్తారు. 14న దేగులహాలు, నగరడోణ, 15న ఏరూరు, బంటనహాలు, 16న చిప్పగిరి, రామదుర్గం, 17వ తేదీన దౌల్తాపురం, నంచర్ల, 18న నేమకల్లు 19న బెల్డోణ, కుందనగుర్తి, 20 వతేదీన గుమ్మనూరు, ఖాజీపురం గ్రామాల్లో గ్రామ సభలు ఏర్పాటు చేసి ఆయా గ్రామాలకు మంజూరైన పనుల వివరాలు వెల్లడించి తీర్మానాలు చేస్తామని ఆయన తెలిపారు.

చట్టాలతో మహిళలకు రక్షణ

ఆలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: మహిళల రక్షణ కోసం ఎన్నో చట్టాలు ఉన్నాయని, వాటి ద్వారా రక్షణ పొందొచ్చని ఆలూరు జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి కె.హేమ అన్నారు. ఆలూరులోని ఐసీడీఎస్ కార్యలయంలో బుధవారం అంగన్‌వాడీ కార్యకర్తలకు విధాన్ సే సమాధాన్ పేరుతో మహిళా న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. జాతీయ మహిళా కమిషన్, న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఈ సమావేశం నిర్వహించారు. మహిళల కోసం వచ్చిన కిట్లను అందజేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీఓ మద్దమ్మ, న్యాయవాదులు వాయుజీవోత్తమరావు, శేక్షావలి, ప్రవీణ్, షాకీర్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు పద్మావతి, పొదుపు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న న్యాయమూర్తి హేమ

కూటమి ప్రభుత్వం రైతుల పక్షమే

ఆదోని గ్రామీణం, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం రైతుల పక్షాననే పనిచేస్తుందని ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి అన్నారు. ఆదోని మార్కెట్‌యార్డులోని కేడీసీఎంఎస్ కేంద్రంలో బుధవారం రైతులకు రాయితీ శనగ విత్తనాల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో ఆదోని ఏడీఏ అరుణ కుమారి, ఏఈవో సతీష్, మార్కెట్ యార్డు సహాయ కార్యదర్శి శాంతకుమార్, గ్రామ వ్యవసాయ సహాయకులు, భాజపా, జనసేన, తెదేపా నాయకులు పాల్గొన్నారు.



ఆదోని గ్రామీణం: శనగ విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పార్థసారథి

ఆస్పరి, న్యూస్‌టుడే: రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని తెదేపా ఆలూరు నియోజకవర్గ బాధ్యుడు వీరభద్రగౌడ్ అన్నారు. స్థానిక గ్రామ పంచాయతీ కార్యాల ఆవరణలో బుధవారం విత్తనాలు పంపిణీ చేశారు. సర్పంచి రాధమ్మ, భాజపా నాయకుడు వెంకటరాముడు, జడ్పీటీసీ సభ్యుడు దొరబాబు మాట్లాడారు.



ఆస్పరి: విత్తనాలు పంపిణీ చేస్తున్న వీరభద్ర గౌడ్

ఇనాం భూములను త్వరగా గుర్తించాలి

ఆలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: గ్రామాల్లోని సర్వీసు ఇనాం భూములను త్వరగా గుర్తించాలని పత్తికొండ ఆర్డీఓ భరత్ నాయక్ అన్నారు. బుధవారం మొదటి సారిగా ఆలూరుకు వచ్చిన ఆయన తహసీల్దారు కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలు పరిష్కరించాలన్నారు. ఆయన వెంట తహసీల్దారు గోవింద్ సింగ్, ఆర్ఐ బసవన్నగౌడ్ ఉన్నారు. కార్యక్రమంలో వీఆర్వోలు అమరేశ్వర్‌రెడ్డి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దారు కార్యాలయాన్ని తనిఖీ చేస్తున్న ఆర్డీవో భాస్కర్ నాయక్

ఆస్పరి, న్యూస్‌టుడే: రెవెన్యూ అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి విధులు నిర్వహించాలని పత్తికొండ డివిజన్ ఆర్డీవో భరత్ నాయక్ అన్నారు. దేవరగట్టుకు వెళ్తూ.. ఆస్పరి తహసీల్దారు కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దారు శివశంకర్ నాయక్, ఆర్ఐ భీమేష్, సీనియార్ సహాయకులు రంగస్వామి, తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దారు కార్యాలయం తనిఖీ

తుగ్గలి, న్యూస్‌టుడే: పత్తికొండ ఆర్డీవో భరత్ నాయక్ తుగ్గలి తహసీల్దారు కార్యాలయాన్ని బుధవారం తనిఖీ చేశారు. రెవెన్యూ రికార్డులు నిర్వహణ పక్కాగా ఉండాలని ఇన్‌ఛార్జి తహసీల్దారు నాగరాజును ఆదేశించారు. కార్యక్రమంలో సర్వేయర్ సుధాకర్, వీఆర్వోలు పాల్గొన్నారు.

ఇబ్బందులు లేకుండా చర్యలు

ఆదోని గ్రామీణం న్యూస్‌టుడే: రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ అన్నారు. ఆదోని మార్కెట్ యార్డును బుధవారం తనిఖీ చేశారు. రైతులతో నేరుగా మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డు సహాయ కార్యదర్శి శాంతకుమార్, సీఎస్‌డీటీ వలిభాష, తదితరులు పాల్గొన్నారు.

యువకుడి అరెస్టు

ఆదోని నేరవార్తలు, న్యూస్‌టుడే: డోన్ పట్టణానికి చెందిన కృష్ణ అనే యువకుడిని బుధవారం అరెస్టు చేసినట్లు రెండో పట్టణ సీఐ సూర్యమోహన్‌రావు తెలిపారు. కృష్ణ గత నెల 29వ తేదీన ఆదోని పట్టణానికి చెందిన ఓ బాలికను అపహరించినట్లు బాలిక తల్లి ఫిర్యాదు చేశారు. కృష్ణపై పోక్సో కేసు నమోదు చేసి అరెస్టు చేశామన్నారు.

పిడుగుపాటుకు ఎద్దు మృతి

బొందిమడుగుల(తుగ్గలి), న్యూస్‌టుడే: బొందిమడుగుల గ్రామంలో బుధవారం పిడుగు పడి రైతు తీర్థమయ్యకు చెందిన ఎద్దు మృత్యువాత పడింది. పొలంలో రెండు ఎద్దులు దూరం దూరంగా మేత మేస్తున్నాయి. ఓ ఎద్దుపై పిడుగు పడటంతో అక్కడికక్కడే మృతిచెందింది. వర్షం ప్రారంభం కాగానే రైతు కుటుంబ సభ్యులు చెట్టు నీడకు చేరడంతో పిడుపాటు తప్పిందని గ్రామస్థులు తెలిపారు.

ఉన్నత శిఖరాలు చేరుకోవాలి

ఆలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: సెపక్‌తక్రాలో మరిన్ని ఉన్నత శిఖరాలు చేరుకోవాలని మాదాసి, మాదారి కురవ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాంమోహన్, తాలుకా కన్వీనర్ కొడికే రాజు, బెలగంటి కురవ హనుమప్ప అన్నారు. ఆలూరులోని రోడ్డు భవనాల అతిథిగృహంలో సెపెక్‌తక్రా క్రీడాకారుడు మధును బుధవారం సన్మానించారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు శేషప్ప, బజారి, ఎండీహళ్లి సర్పంచి సుధాకర్, ప్రధాన కార్యదర్శి మల్లయ్య, మల్లికార్జున, సర్దార్, తిప్పేశ్, ఆనంద్, చంద్ర, లింగమూర్తి, రాజు, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.



మధును సన్మానిస్తున్న మాదారి, మాదారి కురవ సంఘం నాయకులు

మెలకువలతో అధిక దిగుబడులు

హోసూరు(పత్తికొండ గ్రామీణం), న్యూస్‌టుడే: రైతులు పంటల సాగులో మెలకువలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని పత్తికొండ వ్యవసాయ విస్తరణాధికారి రియాజ్ అన్నారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని హోసూరు, పుచ్చకాయలమడ గ్రామాల్లో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో రైతు సేవా కేంద్రాల సిబ్బంది, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

మద్దికెర, న్యూస్‌టుడే: మద్దికెరలో ఓ పొలంలో రైతుకు విత్తనశుద్ధిపై అవగాహన కల్పించినట్లు వ్యవసాయ అధికారి రవి తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది జాకీర్, ఆనంద్ పాల్గొన్నారు.

విప్లవ వీరుడు చెగువేరా

దేవనకొండ, న్యూస్‌టుడే: పెట్టుబడిదారి వ్యవస్థను అంతమొందించేందుకు పోరాడిన యోధుడు చెగువేరా అని సీపీఐ మండల కార్యదర్శి నరసారావు అన్నారు. దేవనకొండలో ఆయన వర్ధంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో నాయకులు భాస్కర్, మధు, రాజీవ్ తదితరులు పాల్గొన్నారు.



చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న యువకులు, విద్యార్థి సంఘం నాయకులు

వైకాపా పాలనలోనే నిధుల దుర్వినియోగం

☛ ఎమ్మెల్యే పార్థసారథి

ఆదోని గ్రామీణం, న్యూస్‌టుడే: వైకాపా పాలనలో నిధులు దుర్వినియోగమయ్యాయని, దీనిపై వైకాపా మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి, నాయకులకు సవాల్ విసురుతున్నా.. చర్చకు సిద్ధమా అని ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి అన్నారు. ఆదోని మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆదోని మండలంలోని గ్రామాల్లో ఎక్కడపడితే అక్కడ నాణ్యత లేని నాసిరకం పనులు చేసి నిధులు స్వాహా చేశారన్నారు. ధైర్యం ఉంటే రండి.. ప్రజలు, అధికారుల సమక్షంలోనే జరిగిన పనులపై విచారణ చేద్దామన్నారు. కమీషన్లకు కక్కుర్తి పడి ప్రజాధనాన్ని లూటీ చేశారని ధ్వజమెత్తారు. తమ దగ్గర అన్ని ఆధారాలు ఉన్నాయని, సవాల్‌ను స్వీకరించాలన్నారు. కూటమి ప్రభుత్వం మాటల ప్రభుత్వం కాదని, చేతల్లో చూపుతుందన్నారు. సమావేశంలో ఎంపీడీవో రాజేంద్రప్రసాద్, ఈవోఆర్‌డీ జనార్దన్, పంచాయతీరాజ్ డీఈ రాణి పాల్గొన్నారు.

ఉపాధి హామీ పథకంతో పనులు

పత్తికొండ గ్రామీణం, న్యూస్‌టుడే: గ్రామాల్లో ఈ నెల 14 నుంచి నిర్వహించే పల్లె పండగ కార్యక్రమానికి ఉపాధి హామీ పథకం కింద చేపట్టే వివిధ పనుల వివరాలతో సిద్ధంగా ఉండాలని పథకం ఏపీడీ పక్కీరప్ప అన్నారు. పత్తికొండ మండల పరిషత్తు సమావేశ భవనంలో బుధవారం నిర్వహించిన పథకం క్షేత్ర, సాంకేతిక సహాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి గ్రామ పరిధిలో చేపట్టే పనుల గుర్తింపు, ఉపాధి కూలీల సంఖ్య పెంపు తదితర వివరాలు సేకరించాలన్నారు. కార్యక్రమంలో ఏపీవో వెంకటేశ్వర్లు, సిబ్బంది జిలాన్, రత్నం తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శ్రీకారం

వెల్దుర్తి, న్యూస్‌టుడే: వైకాపా పాలనలో నిధుల కొరత కారణంగా వెల్దుర్తి మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలో మురుగు కాల్వల నిర్మాణ పనులు జరగలేదు. కూటమి ప్రభుత్వం రావడంతో అభివృద్ధి పనులు ప్రారంభమయ్యాయి. వెల్దుర్తిలోని నాలుగో వార్డులో కాల్వలు లేకపోవడంతో కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు. ఎమ్మెల్యే కేఈ.శ్యాంబాబు కాల్వల నిర్మాణాలకు నిధులు కేటాయించడంతో పనులను మండల తెదేపా నాయకులు బొమ్మన రమాకాంత్‌రెడ్డి ప్రారంభించారు.

ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలి


ఎల్లార్తి(హొళగుంద), న్యూస్‌టుడే: బన్ని ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని ఆలూరు సీఐ శ్రీనివాస నాయక్, ఎంపీడీవో విజయలలిత, డీటీ నిజాముద్దీన్, శిక్షణ ఎస్సై షేక్ మహబూబ్ బాషా, అన్నారు. ఎల్లార్తి గ్రామంలో అవగాహన సదస్సు నిర్వహించారు.

చిప్పగిరి ఎస్సైగా సతీష్ కుమార్

చిప్పగిరి, న్యూస్‌టుడే: చిప్పగిరి ఎస్సైగా సతీష్ కుమార్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. రమేష్‌బాబు బదిలీ కాగా ఆయన స్థానంలో సతీష్ కుమార్ విధుల్లో చేరారు.

నకిలీ మెసేజ్‌తో మోసం

ఆదోని నేరవార్తలు, న్యూస్‌టుడే: ఆదోని పట్టణానికి చెందిన ఓ హోటల్ నిర్వాహకుడిని సైబర్ మోసగాడు నకిలీ ఫోన్‌పే యాప్‌తో బురిడీ కొట్టించేందుకు యత్నించిన ఘటన బుధవారం ఆదోనిలో వెలుగు చూసింది. ఆదోని పట్టణంలోని మార్కెట్ యార్డు సమీపంలోని గౌడ హోటల్ నిర్వాహకుడికి ఓ వ్యక్తి ఫోన్ చేసి అర్జెంట్‌గా 18 భోజనాలు పార్శిల్ చేయాలని సూచించారు. ఆ తర్వాత బిల్లు రూ.1880 అయిందని హోటల్ నిర్వాహకుడు ఫోన్‌లో చెప్పారు. ఆ మొత్తాన్ని ఫోన్‌పే పంపిస్తానని చెప్పాడు. ఇంతలో హోటల్ నిర్వాహకుడికి పై మొత్తానికి బదులుగా రూ.11,880 ఫోన్‌పే చేసినట్లు మెజేస్ పంపించారు. తాను పొరపాటున రూ.10 వేలు అధికంగా పంపానని, వెంటనే ఆ మొత్తం తిరిగి తనకు పంపించాలని హోటల్ నిర్వాహకుడితో చెప్పాడు. ఆ మొత్తం తన ఖాతాలోకి రాలేదని.. డబ్బులు రాకుండా ఎలా పంపించాలని హోటల్ నిర్వాహకుడు సమాధానమిచ్చారు. ఫోన్ చేసిన వ్యక్తి దబాయిస్తూ.. పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తానని చెప్పాడు. ఇందుకు హోటల్ నిర్వాహకుడు సరే పోలీసు స్టేషన్‌లోనే తేల్చుకుందామని చెప్పడంతో ఫోన్ చేసిన వ్యక్తి మిన్నకుండిపోయాడు.



డబ్బులు పంపించినట్లు నకిలీ మెసేజ్

ఆరేళ్ల బాలిక అపహరణకు యత్నం

ఆదోని నేరవార్తలు, న్యూస్‌టుడే: ఆదోని పట్టణంలోని టీజీఎల్ కాలనీకి చెందిన ఆరేళ్ల బాలికను అపహరించేందుకు యత్నించిన సంఘటన బుధవారం సాయంత్రం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. టీజీఎల్ కాలనీకి చెందిన ఆరేళ్ల బాలిక ఆడుకుంటూ ఉండగా గుర్తుతెలియని ఇద్దరు వ్యక్తులు మాయమాటలు చెప్పి తీసుకెళ్లారు. స్థానిక బీరప్ప దేవాలయం సమీపంలోని ఓ పాడుబడిన ఇంటిలో తీసుకెళ్లినట్లు తెలిపారు. స్థానికులు గుర్తించడంతో ఆ యువకులు బాలికను అక్కడే వదిలేసి పరారయ్యారన్నారు. అప్పటికే బాలిక అపస్మారక స్థితిలో పడి ఉందన్నారు. బాలిక తేరుకున్నాక తల్లిదండ్రుల చిరునామా తెలుసుకొని వారికి అప్పగించారు. ఆదోని ఒకటో పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

శిథిల గోడలు.. నెరవేరని కలలు

మద్దికెర, న్యూస్‌టుడే: పేదోడి గూడు కల నిజం చేస్తామని గత ప్రభుత్వం ఇళ్లు మంజూరు చేసింది. హడావుడిగా పనులు చేపట్టింది. రహదారులు వేసి, కల్వర్టులు సైతం నిర్మించింది. తీరా చూస్తే.. మధ్యలోనే వదిలేశారు. వేసిన దారులు చెదురుతున్నాయి.. నిర్మించిన పునాదులు కూలుతున్నాయి. సొంతింటి కల కలగానే మిగిలింది.



నిరుపేదలతో ఆటలు

మద్దికెర మండలంలోని బురుజుల గ్రామంలో ఇల్లు లేని నిరుపేదల కోసం 2007లో కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల నుంచి స్థలం కొనుగోలు చేసి 88 మందికి ఒకే చోట స్థలం కేటాయించారు. ఇళ్లు కూడా మంజూరు చేశారు. కొందరు నిర్మాణం ప్రారంభించారు. లబ్ధిదారుల సౌకర్యార్థం ఇక్కడ రూ.12 లక్షలతో అంతర్గత రహదారులు, కల్వర్టులు నిర్మించారు. ఒకే వర్షానికి పునాదులు కొట్టుకుపోయాయి. లబ్ధిదారులు మరోసారి ఇంటి నిర్మాణం చేపట్టేందుకు ముందుకు రాలేదు. నిధులన్నీ దుర్వినియోగం అయ్యాయి తప్ప ప్రయోజనం లేకుండా పోయింది. అధికారులు, ప్రభుత్వం ఈ సారైనా బాధితులకు న్యాయం చేయాలని స్థానికులు కోరుతున్నారు. మద్దికెరలోని ఎస్సీ కాలనీ వద్ద కొందరికి ఇళ్లు నిర్మించినా.. ఊరికి దూరంగా ఉన్నాయనే కారణంగా వాటిలో చేరలేదు. దీంతో అవి శిథిలమయ్యాయి. ఇలా ప్రభుత్వ నిధులు దుర్వినియోగం అవుతున్నాయి. తర్వాత అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాలూ పట్టించుకోలేదు. ఇక్కడ నేటికీ ఎలాంటి నిర్మాణాలు చేపట్టలేకపోయారు. ఇప్పటికైనా కాలనీ అభివృద్ధిపై దృష్టిసారించాలని కోరుతున్నారు.

రూ.లక్షలు వృథా అయ్యాయి

– వీరేశ్, బురుజుల



పేదల ఇళ్ల కోసం అవగాహన లేని అధికారులు ముంపుకు గురయ్యే ప్రాంతాన్ని ఎంపిక చేశారు. ఆ ప్రాంతంలో చేపట్టిన నిర్మాణాలతో రూ.40 లక్షలకు పైగా ప్రజాధనం వృథా అయింది. ఈ ప్రభుత్వమైనా ప్రజలకు న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలి. స్థలం ముంపుకు గురికాకుండా గోడ నిర్మిస్తే ప్రమాదం ఉండదు. అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టాలి.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం

– ఉమాకాంత్, ఏఈ, గృహ నిర్మాణశాఖ

బురుజుల గ్రామంలో నిరుపయోగంగా ఉన్న ఇళ్ల స్థలాల విషయమై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. లబ్ధిదారులకు ఆసక్తి ఉంటే ఇళ్లు నిర్మించుకుంటే అవసరమైన చర్యలు తీసుకుంటాం. కాలనీని వినియోగంలోకి తెచ్చే విషయమై జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్తాం.



ఎమ్మిగనూరు

• ఎమ్మిగనూరు • మంత్రాలయం • కోడుమూరు



మాట్లాడుతున్న సురేష్‌కుమార్

పీఆర్సీ తక్షణమే అమలు చేయాలి

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: ఉద్యోగ, ఉపాధ్యాయులకు ప్రభుత్వం తక్షణమే 12వ పీఆర్సీని అమలు చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షుడు సురేష్‌కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం ఎమ్మిగనూరు యూటీఎఫ్ కార్యాలయంలో జిల్లా నాయకులు సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల ముందు ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తామని కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చిందన్నారు. 30శాతం మధ్యంతర భృతి చెల్లించాలని కోరారు. పీఆర్సీని అమలు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. పీఆర్సీ అమలు జాప్యంతో ఉద్యోగ, ఉపాధ్యాయ రంగాలు తీవ్రంగా నష్టపోయారని ఆరోపించారు.

వేరుశనగ క్వింటా రూ.6,570

ఎమ్మిగనూరు వ్యవసాయం, న్యూస్‌టుడే: ఎమ్మిగనూరు వ్యవసాయ మార్కెట్లో బుధవారం వేరుశనగ క్వింటా గరిష్ఠ ధర రూ.6,570, మధ్యస్థం రూ.4,900, కనిష్ఠం రూ.2,460కు వ్యాపారులు కొన్నారు. మార్కెట్‌కు రైతులు 6,023 వేరుశనగ బస్తాలను అమ్మకానికి తెచ్చారు. ఆముదాలు క్వింటా గరిష్ఠ ధర రూ.5,800, మధ్యస్థం రూ.5,797, కనిష్ఠం రూ.4,430 పలికింది.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
ఎమ్మిగనూరు గ్రామీణం : 80085 73794
కోడుమూరు : 80085 73776

నందవరం, న్యూస్‌టుడే: **సమస్య:** నాగలదిన్నె గ్రామంలో కుళాయి నుంచి వచ్చే తాగునీరు కలుషితం అవుతోంది. -ఆనంద్‌రెడ్డి, నాగలదిన్నె

సమాధానం: గ్రామంలో శుద్ధజలం సరఫరా చేసే విధంగా చర్యలు తీసుకుంటాం.
-లక్ష్మీదేవమ్మ, ఎంపీపీ, నందవరం

పెద్దకడబూరు, న్యూస్‌టుడే: **సమస్య:** బాపులదొడ్డి గ్రామంలో చాలా రోజుల నుంచి కాల్వలు శుభ్రం చేయడం లేదు. దీంతో కాల్వలు నిండి అపరిశుభ్రతతో దుర్వాసన వెదజల్లుతోంది. -గ్రామస్థులు, బాపులదొడ్డి

సమాధానం: గ్రామంలో నెలకొన్న అపరిశుభ్రత సమస్యను గ్రామ కార్యదర్శి, సర్పంచి దృష్టికి తీసుకెళ్తాం. పంచాయతీలో నిధులను అనుసరించి పారిశుద్ధ్య నిర్మూలన చర్యలు చేపడతాం.
-జయరాముడు, ఇన్‌ఛార్జి ఎంపీడీవో, పెద్దకడబూరు

ప్రతిపాదనలు సిద్ధం చేయండి



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: పట్టణంలో తాగునీరు, మురుగ కాల్వలు, సీసీ రోడ్లు, ఇతర పనుల కోసం 15వ ఆర్థిక సంఘం కింద వచ్చిన నిధులకు ప్రతిపాదనలు వేగవంతం చేయాలని పురపాలక కమిషనర్ గంగిరెడ్డి ఆదేశించారు. బుధవారం ఏఈ, డీఈలతో అభివృద్ధి పనులపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. పట్టణానికి 15వ ఆర్థిక సంఘం నిధుల కింద రూ.18 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ నిధులతో ఆయా వార్డుల్లో డ్రైనేజీ, రోడ్లుకు అవసరమైన ప్రతిపాదనలు త్వరగా పూర్తి చేయాలన్నారు. దాదాపు 30 పనులు సగంలో నిలిచిపోయినట్లు వివరించారు. గుత్తేదారులు పనులు ఆలస్యం చేస్తే వారికి నోటీసులు ఇచ్చి రద్దు చేస్తామని హెచ్చరించారు.

చిరుతలకు హాని చేయవద్దు

ఎమ్మిగనూరు వ్యవసాయం, న్యూస్‌టుడే: గ్రామాల్లో చిరుతల సంచారంపై సమాచారం అందిస్తే వాటిని బంధించేందుకు చర్యలు తీసుకుంటామని వాటికి ఎలాంటి హాని తలపెట్టవద్దని అటవీశాఖ రేంజ్ అధికారిణి తేజస్వి, బీట్ అధికారిణి అనురాధ బుధవారం పేర్కొన్నారు. ఉప విభాగంలో చిరుతల సంచారం ఉండటంతో రాత్రి వేళల్లో బీట్ నిర్వహిస్తూ ప్రజలకు తరుచూ అవగాహన కల్పిస్తున్నామని తెలియజేశారు. చిరుతల దాడిలో పశువులు, జీవాలును చంపి నష్టం కలగజేస్తే అలాంటి రైతులకు పరిహారం అందించేందుకు చర్యలు తీసుకుంటామని ఇప్పటికే కొందరు రైతులకు పరిహారం అందించినట్లు వెల్లడించారు.

ఖాళీ స్థలం.. కనిపిస్తే కబ్జా

మొత్తం లేఅవుట్లు: 21
ఖాళీ స్థలాల విస్తీర్ణం: 33.47 ఎకరాలు
ఆక్రమణలకు గురైనవి: 1.92"
పార్కులు, మైదానాలు: 6.10"
కమ్యూనిటీ భవనాలు, పాఠశాలలు: 7.49"
ప్రహరీ లేనివి: 10

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: ఖాళీ స్థలాలు కనిపిస్తే చాలు కబ్జాల పర్వం సాగుతోంది. కొందరు ప్రభుత్వ స్థలాలపై కన్నేశారు. రూ.కోట్ల విలువ చేసే స్థలాలకు కంచె లేక పోవడంతో అన్యాక్రాంతమయ్యే ప్రమాదం ఉంది. ఎమ్మిగనూరు పట్టణం 14.50 చదరపు కి.మీ. విస్తీర్ణంలో ఉంది. 33.47 ఎకరాల ఖాళీ స్థలం ఉంది. అందులో సగానికిపైగానే వివిధ ప్రభుత్వ భవనాలు, దేవాలయాలు, సామాజిక భవనాలు నిర్మించారు. ఖాళీగా ఉన్న స్థలాల్లో ప్రహరీ నిర్మించకపోవడంతో కబ్జాలకు పాల్పడే అవకాశం ఉంది. ఎనిమిది చోట్ల వివిధ ప్రభుత్వ భవనాలు, పేదలు గుడిసెలు వేసుకొని నివాసం ఉంటున్నారు.

రూ. కోటి విలువ



ఎద్దుల మార్కెట్ వద్ద బోర్డు ఉన్న మున్సిపాలిటీ స్థలం

ఎద్దుల మార్కెట్ వద్ద 3 నుంచి 5 సెంట్లు రూ. కోటిపైగానే విలువైన స్థలం ఉంది. కొందరు వ్యక్తులు స్థలం తమదని ఆరోపించి ఆక్రమించేందుకు ప్రయత్నించారు. కానీ మున్సిపల్ అధికారులు అడ్డుకొని ఇది ప్రభుత్వ స్థలమని చెప్పి అక్కడ ఉన్న బండలను తొలగించారు.

★ మైనారిటీ కాలనీలో ఎల్‌పీ నంబర్ 164-89లో 6.2 ఎకరాల స్థలాలు ఉన్నాయి. వీటిలో మూడెకరాలను కస్తూర్బా పాఠశాల, స్త్రీ శక్తి భవనం కోసం కేటాయించారు. ఇందులో కస్తూర్బా పాఠశాల భవనం నిర్మించారు.


★ గీతానగర్‌లో సర్వే నంబర్ 420లో 36 సెంట్ల స్థలాన్ని కొందరు నేతలు తమదే అని కబ్జా చేసేందుకు ప్రయత్నించారు. అప్పట్లో మాజీ కౌన్సిలరు కోనేరు నాగేంద్రప్రసాద్, ప్రజలు అడ్డుకోవడంతో స్థలం వివాదం సమసిపోయింది. గతంలో దీనిపై కౌన్సిల్‌లో సైతం దుమారం లేపింది. ఇందుకు కంచె వేసేందుకు రూ.3 లక్షలు నిధులు మంజూరు చేసినా పనులు చేపట్టలేదు.

★ ఉప్పర కాలనీలో 1.97 ఎకరాలు స్థలం ముళ్లపొదలుతో నిండి ఉంది. గతంలో ఈ స్థలంలో పార్కును ఏర్పాటు చేసేందుకు అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. నిధులు లేక పోవడంతో వదిలేశారు.

★ సర్వే నంబరు 22-23లో 3.90 ఎకరాల ఖాళీ స్థలాలు మున్సిపాలిటీకి చెందినవి. వీటి ఆనవాళ్లు కూడా సరిగా గుర్తించలేని పరిస్థితి.

★ ఎస్సీ కాలనీలో రెండు చోట్ల ఖాళీ స్థలాలు ఉన్నాయి. కలుగట్ల రహదారిలో ఉండే వంక పోరంబోకు స్థలాలు సైతం కబ్జా చేసే అవకాశం ఉంది. ఎస్‌ఎంటీ కాలనీలో ఖాళీ స్థలాలకు ప్రహరీ ఏర్పాటు చేయలేదు.

40 సెంట్ల స్థలం



వెంకటసాయి దేవాలయం పక్కన 40 సెంట్ల ఖాళీ స్థలంలో ప్రహరీ నిర్మాణం కోసం రూ.10 లక్షలు విడుదల చేశారు. అయితే నిర్మాణం, చేపట్టకుండా మధ్యలో వదిలేశారు. గతంలో ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి రూ.పది లక్షలు విలువ చేసే స్థలాన్ని ఆక్రమించేందుకు యత్నించారు. వీటిని అడ్డుకోవడంతో వదిలేశారు. ప్రస్తుతం ఖాళీ స్థలంలో ఒకవైపు మాత్రమే గోడ ఉంది.

చర్యలు తీసుకుంటాం -గంగిరెడ్డి, పురపాలక కమిషనర్, ఎమ్మిగనూరు

ఖాళీ స్థలాల వివరాలు పరిశీలిస్తాం. ఆక్రమణలకు గురి కాకుండా కంచె ఏర్పాటు చేసే విధంగా ప్రణాళికలు తయారు చేస్తాం.

శ్రీమఠంలో మద్రాసు హైకోర్టు న్యాయమూర్తి

మంత్రాయలం, న్యూస్‌టుడే: రాఘవేంద్ర స్వామి బృందావనం దర్శనార్థం తమిళనాడు రాష్ట్రం మద్రాసు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ధనాబల్ బుధవారం మంత్రాలయం చేరుకున్నారు. మఠం సంప్రదాయం ప్రకారం అధికారులు స్వాగతం పలికారు. ముందుగా గ్రామ దేవత మంచాలమ్మను, అనంతరం రాఘవేంద్రస్వామి మూల బృందావనాన్ని దర్శించుకున్నారు. పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థులు వీరికి శేష వస్త్రం, జ్ఞాపిక, ఫలమంత్ర అక్షితలు ఇచ్చి ఆశీర్వదించారు.

నేటి నుంచి మార్కెట్‌కు సెలవు

ఎమ్మిగనూరు వ్యవసాయం, న్యూస్‌టుడే: దసరా పండగ నేపథ్యంలో వ్యవసాయ మార్కెట్‌కు గురువారం నుంచి సెలవు ఉంటుందని రైతులు పంట దిగుబడులు మార్కెట్‌కు తీసుకు రావద్దని మార్కెట్ కార్యదర్శి పద్మావతి బుధవారం తెలిపారు. మార్కెట్ సోమవారం నుంచి యథావిధిగా తెరుస్తున్నట్లు పేర్కొన్నారు.

మద్యం దుకాణాలకు వెల్లువెత్తిన దరఖాస్తులు

కోడుమూరు గ్రామీణం, న్యూస్‌టుడే: మద్యం దుకాణాలకు దరఖాస్తు చేసుకునేందుకు గడువు పెంచినట్లు ఆబ్కారీశాఖ సీఐ మంజుల తెలిపారు. కోడుమూరు ఆబ్కారీశాఖ కార్యాలయం పరిధిలో బుధవారం మొత్తం 350 దరఖాస్తులు వచ్చినట్లు చెప్పారు. ఈ నెల 11 వరకు దరఖాస్తు స్వీకరిస్తామన్నారు.

పంటల సాగులో యాంత్రీకరణ పెంచాలి



మాట్లాడుతున్న నాబార్డు జిల్లా అభివృద్ధి మేనేజరు సుబ్బారెడ్డి

ఎమ్మిగనూరు గ్రామీణం, న్యూస్‌టుడే: పంటల సాగులో రైతులు ఆధునాత వ్యవసాయ పరికరాల వినియోగాన్ని పెంచాలని నాబార్డు జిల్లా అభివృద్ధి మేనేజరు సుబ్బారెడ్డి సూచించారు. బుధవారం బనవాసి కృషి విజ్ఞాన కేంద్రంలో రైతు ఉత్పత్తిదారుల సంఘం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. రైతులు పంటల సాగులో సేంద్రియ విధానంతో పాటు మందుల పిచికారికి డ్రోన్లు వినియోగించాలన్నారు. రైతు ఉత్పత్తి సంఘాలు నాణ్యమైన విత్తనోత్పత్తి తయారు చేసేందుకు కృషి చేయాలని వివరించారు. రైతు సంఘాలతో వ్యవసాయంలో పంట ఉత్పత్తి, మార్కెటింగ్ చేసేందుకు సులువుగా ఉంటుందని ఇలాంటి సంఘాలకు నాబార్డు ఆర్థిక చేయూత అందిస్తుందని వెల్లడించారు. రైతులు పంట ఉత్పత్తుల విక్రయానికి ఈ-ఫాం యాప్‌లో నమోదు చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో కేవీకే సమన్వయకర్త డాక్టర్ రాఘవేంద్ర, నాబార్డు ప్రతినిధులు వెంకట్, రేఖ, సురేంద్ర, శాస్త్రవేత్తలు నిరంజన్‌రెడ్డి, శ్రీచందన పాల్గొన్నారు.

చెరువు కాదు రహదారి



కౌతాళం మండలం పోదలకుంట ఇందిరమ్మ కాలనీలో రహదారిపై మోకాలి లోతు వర్షపు నీరు గత నెల రోజులుగా నిలిచిపోయాయి. దీంతో ఆ రహదారి చెరువును తలపిస్తోంది. రహదారికి ఇరువైపులా కాల్వలు పూడ్చడంతో వర్షం నీరు ఇళ్ల ముందు నిలిచాయి. దీంతో దోమలు వ్యాప్తి చెందాయని కాలనీవాసులు పేర్కొన్నారు.

-న్యూస్‌టుడే, మంత్రాలయంగ్రామీణం(కౌతాళం)

గుంతల దారిలో అవస్థల ప్రయాణం



పెద్దకడబూరు నుంచి ఆదోని వెళ్లే రహదారి అధ్వానంగా తయారైంది. చిన్న వర్షానికి రహదారిపై గుంతలు నిండి ప్రయాణికుల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. దీంతో ప్రయాణికులు, ద్విచక్ర వాహనదారులు నానా అవస్థలు పడుతున్నారు. ఈ రహదారి పెద్దకడబూరు నుంచి రంగాపురం వరకు సుమారు 7 కి.మీ. మేర పూర్తిగా ఛిద్రమైంది. రహదారిపై నిత్యం పెద్దకడబూరు, చిన్నకడబూరు, రంగాపురం, కల్లుకుంట మేకడోన, జాలవాడి, కంబళదిన్నె తదితర గ్రామాల నుంచి వందల సంఖ్యలో వాహనాలు రాకపోకలు కొనసాగిస్తున్నారు. రహదారికి మరమ్మతులు చేయాలని ప్రయాణికులు, వాహనదారులు కోరుతున్నారు.

-న్యూస్‌టుడే, పెద్దకడబూరు

మెరిసిన పేదింటి ఆణిముత్యం



నియామక పత్రాన్ని అందుకుంటున్న గాంధాల శివశంఖర్

కోసిగి, న్యూస్‌టుడే: తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన డీఎస్సీ పరీక్షల్లో కోసిగి మండలం సజ్జలగూడెం గ్రామానికి చెందిన గాంధాల ఉలిగప్ప, మారుతమ్మ కుమారుడు శివశంకర్ ప్రతిభ కనబరిచారు. తెలంగాణ రాష్ట్ర స్థాయి ఓపెన్ క్యాటగిరిలో 36వ ర్యాంకు సాధించడంతో కుటుంబ సభ్యులు, గ్రామస్థులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఎస్‌జీటీగా నియమితులయ్యారని కుటుంబ సభ్యులు తెలిపారు. శివశంకర్ బుధవారం హైదరాబాద్‌లో డీఈవో చేతుల మీదుగా ఉపాధ్యాయ నియామక పత్రాన్ని అందుకున్నారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు

ఎమ్మిగనూరు గ్రామీణం, న్యూస్‌టుడే: పత్తి పంటలో సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించడంతో అధిక దిగుబడులు పొందవచ్చునని మండల వ్యవసాయాధికారి ఎన్వీ మహేశ్వరరెడ్డి అన్నారు. బుధవారం కడివెళ్లలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రతి రైతు పంట నమోదు చేయించుకొని ఈ కేవైసీ చేయించుకోవడంతో ప్రభుత్వం అందించే రాయితీ, ఇతర పథకాలు పొందవచ్చునన్నారు. భూసార పరీక్షలు ద్వారా ఎరువులు వినియోగించుకుంటే మంచి దిగుబడులు పొందవచ్చునన్నారు.

పంట మార్పిడితో దిగుబడి

కోడుమూరు గ్రామీణం, న్యూస్‌టుడే: పంట మార్పిడితో దిగుబడి పెరుగుతుందని మండల వ్యవసాయాధికారి రవిప్రకాశ్ సూచించారు. పులకుర్తిలో బుధవారం పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంఏవో మాట్లాడుతూ.. ఎప్పుడు ఒకే పంట వేయడంతో తెగుళ్ల బారిన పడి దిగుబడులు తగ్గుతుందని వివరించారు. రసాయనిక ఎరువుల వాడకంతో భూసారం తగ్గుతుందన్నారు. సేంద్రియ ఎరువుల వాడకం పెంచితే పంటల దిగుబడి పెరుగుతుందని పేర్కొన్నారు. విత్తనాలు వాడకంలో కొత్త వంగడాలను వినియోగించాలన్నారు. కంది పంటలో సస్యరక్షణ చర్యలు వివరించారు.



రైతులకు సూచనలు చేస్తున్న ఎంఏవో

సరస్వతి నమస్తుభ్యం



ఎమ్మిగనూరు గ్రామీణం: చేనేత మైదానంలో..



ఎమ్మిగనూరు గ్రామీణం: కన్యకాపరమేశ్వరి ఆలయంలో..



నందవరం: సోమలగూడూరులో సరస్వతి దేవి అలంకరణలో



మంత్రాలయం గ్రామీణం: ఉప్పరహాల్‌లో..



మంత్రాలయం: సరస్వతి దేవి అలంకరణలో గ్రామ దేవత

దసరా శరన్నవరాత్రుల్లో భాగంగా బుధవారం అమ్మవారు సరస్వతి దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఎమ్మిగనూరులో కన్యకాపరమేశ్వరిదేవి ఆలయం, చేనేత మైదానంలో, హెచ్‌బీఎస్ కాలనీలోని గాయత్రీదేవిని సరస్వతి దేవి అలంకరణ చేసి పూజలు నిర్వహించారు. మంత్రాలయంలో మంచాలమ్మను కూరగాయలతో ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. -న్యూస్‌టుడే బృందం



ఎమ్మిగనూరు: సర్వసతి దేవి అలంకరణలో గాయత్రీదేవి



ఎమ్మిగనూరు: చౌడేశ్వరి దేవాలయంలో సరస్వతి దేవి అలంకరణ



కోడుమూరు గ్రామీణం: రామాలయంలో సరస్వతి దేవిగా దర్శనమిస్తున్న అంబా భవానీ



కోడుమూరు గ్రామీణం: సరస్వతిదేవి అలంకరణలో వల్లెలాంభదేవి ఉత్సవమూర్తి

గర్భిణులకు వైద్య పరీక్షలు

ఎమ్మిగనూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఆసుపత్రిలో బుధవారం ప్రధానమంత్రి మాతృత్వ సురక్ష అభియాన్ కింద 416 మంది గర్భిణులకు స్కానింగ్ పరీక్షలు నిర్వహించారు. ఎమ్మిగనూరు, మంత్రాలయం నియోజకవర్గాల్లోని ఆయా గ్రామాల నుంచి గర్భిణులు రావడంతో స్కానింగ్ కేంద్రం వద్ద కిటకిటలాడారు. గైనకాలజిస్టు ఫాతిమా, సుజిత స్కానింగ్ పరీక్షలు నిర్వహించారు. మార్నింగ్ వాక్ ఫ్రెండ్స్ సంఘం సభ్యులు గర్భిణులకు ఉచితంగా భోజన వసతి ఏర్పాటు చేశారు.

27 మంది దరఖాస్తు

కోడుమూరు గ్రామీణం, న్యూస్‌టుడే: కస్తూర్బా పాఠశాలలో పని చేసేందుకు బోధనేతర సిబ్బంది కోసం ప్రభుత్వం దరఖాస్తులు ఆహ్వానించింది. మండల విద్యావనరుల కేంద్రంలో బుధవారం పెద్ద ఎత్తున దరఖాస్తులు అందజేశారు. మొత్తం 27 మంది అభ్యర్థులు బోధనేతర ఉద్యోగాలకు దరఖాస్తులు చేసుకున్నట్లు ఎంఈవో వసంతలక్ష్మి తెలిపారు. దరఖాస్తుకు ఈ నెల 15 వరకు గడువుందన్నారు.

విద్యార్థులకు వృత్తి విద్యలో శిక్షణ

గోనెగండ్ల, న్యూస్‌టుడే: విద్యార్థులకు పాఠశాల స్థాయి నుంచే వృత్తి విద్యపై సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ షాహినాపర్వీన్ తెలిపారు. బుధవారం గోనెగండ్లలో విద్యార్థులకు దసరా సెలవుల్లో పది రోజుల పాటు ఆటోమోటివ్ ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాం సమన్వయకర్త, అధ్యాపకుడు విజయకుమార్ శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థులు నైపుణ్యాలు పెంచుకోవడం ద్వారా ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉంటాయాన్నారు.

న్యాయం జరిగే వరకు దీక్ష

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: కల్లుకుంట గ్రామానికి చెందిన గోవిందమ్మకు న్యాయం జరిగే వరకు దీక్ష ఆపేది లేదని మాల మహానాడు నాయకుడు నరసన్న పేర్కొన్నారు. బుధవారం పట్టణంలో సోమప్ప సర్కిల్ దీక్షను కొనసాగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళను గ్రామంలో కట్టేసి చిత్రహింసలు చేసిన నిందితులను వదిలేశారని ఆరోపించారు. దీనిపై దీక్షలు చేపడితే అధికారులు బలవంతంగా ఖాళీ చేయించడం దారుణమన్నారు. బంగారప్ప, అమరేష్, రంగయ్య, నాగేశ్, దేవేంద్రబాబు, ప్రసన్న, నరసప్ప పాల్గొన్నారు.

వీధుల్లో కుక్కలు.. భయాందోళనలో ప్రజలు

మంత్రాలయం, న్యూస్‌టుడే: మంత్రాలయంలో శునకాల బెడదతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. ప్రతి వీధిలో కుక్కలు గుంపులుగా సంచారం చేయడంతో రాఘవేంద్రస్వామి దర్శనానికి వచ్చే భక్తులు కూడా భయపడుతున్నారు. పలువురు కుక్కకాటుకు గురవుతున్నారు. కల్లుదేవకుంట ప్రాథమిక వైద్యశాలలో నెలకు 50 కుక్కకాటు కేసులతో చికిత్స పొందుతున్నారు.



రాఘవేంద్రస్వామి మఠానికి వెళ్లే ప్రధాన రోడ్డుపై శునకాలు

నిత్యం భక్తులతో రద్దీ

మంత్రాలయంలో పాత ఊరు, రామచంద్రనగర్, రాఘవేంద్రపురం, సుశ్మీంద్రనగర్ తదితర కానీల్లో మొత్తం 16 వార్డుల్లో 2,400పైగా నివాస గృహాలు, 80పైగా ప్రైవేటు వసతి గృహాల సముదాయాలు ఉన్నాయి. మంత్రాలయంలో దాదాపు 15,000 జనాభా ఉంటారు. వివిధ పనులు, విధులకు వెళ్లే ఉద్యోగులతో పాటు వందలాది మంది మంది విద్యార్థులు నిత్యం తిరుగుతుంటారు. రాఘవేంద్రస్వామి దర్శనార్థం వివిధ ప్రాంతాల నుంచి ప్రతి రోజు 3 వేల మంది, శని, ఆదివారాల్లో సెలవు రోజుల్లో 15 వేల నుంచి 20 వేల మంది భక్తులు వస్తారు. నిత్యం రద్దీగా ఉండే మంత్రాలయంలో ప్రధాన రహదారులపై కుక్కల సంచారంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు.

శస్త్ర చికిత్సల ఊసే లేదు

సంబంధిత అధికారులు వీధి కుక్కలను పట్టుకుని శస్త్ర చికిత్స చేసి, టీకాలు వేయాలి. నిధుల కొరతతో కుక్కలు పట్టుకునేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు. దీంతో పట్టణంలో కుక్కల సంఖ్య పెరుగుతోంది. పుణ్య క్షేత్రం కావడంతో వ్యాపారాలు, హోటల్, తినుబండారాల తోపుడు బండ్లు అధిక ఉన్నాయి. మిగిలిన ఆహార పదార్థాలు, వ్యర్థాలు రోడ్డుపై ఎక్కడ పడితే అక్కడ పడేస్తుండటంతో వాటిని తినడానికి కుక్కలు రోడ్లపైకి వస్తున్నాయి.

రాఘవేంద్రపురంలో విచ్చల విడిగా మాంసాహార విక్రయ కేంద్రాలు నివాస గృహాల మధ్య ఏర్పాటు చేసి విక్రయిస్తుండటంతో మాంస వ్యర్థాల కోసం కుక్కలు దారిపై కాచుకొని ఉంటున్నాయి. దీంతో రోడ్డుపై వెళ్లే పాదచారులు, విద్యార్థులు, వృద్ధులు, మహిళలపై కుక్కలు దాడులకు పాల్పడుతున్నాయి.

కల్లుదేవకుంట ప్రాథమిక వైద్యశాలలో కుక్క కాటుకు చికిత్స చేయించుకున్న బాధితులు

మే - 60, జూన్ - 52, జూలై - 54, ఆగస్టు - 50, సెప్టెంబర్ - 53

పరిష్కార మార్గం చూస్తాం
-ఎస్.నూర్జహాన్, డివిజనల్ పంచాయితీ అధికారి, ఆదోని

కుక్కలను పట్టుకోవడానికి ప్రత్యేకంగా నిధులు కేటాయించలేదు. ప్రజారోగ్యం దృష్టిలో ఉంచుకొని కుక్కలకు వ్యాక్సిన్ వేయిస్తాం. కడప నుంచి ప్రత్యేక బృందాలను తీసుకువచ్చి కుక్కలను ఇతర ప్రాంతాలకు తరలించే చర్యలు తీసుకుంటాం.

సంక్షిప్త సమాచారం

కోడుమూరు గ్రామీణం, న్యూస్‌టుడే: గోరంట్ల మాధవస్వామి దివ్యక్షేత్రంలో నవరాత్రి ఉత్సవాలు దేవదాయశాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బుధవారం లక్ష్మీదేవిని విద్యాలక్ష్మిగా ముస్తాబు చేశారు. స్వామి, అమ్మవార్లకు ఆగమ శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు.

కోడుమూరు గ్రామీణం, న్యూస్‌టుడే: వెలుగు ఏపీఎంగా సుబ్బయ్య బాధ్యతలు చేపట్టారు. కర్నూలు డీఆర్‌డీఏ కార్యాలయం నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ పని చేస్తున్న ఏపీఎం పుష్పావతి కల్లూరుకు బదిలీ అయ్యారు.

మంత్రాలయం, న్యూస్‌టుడే: మండల పరిధిలోని చెట్నీహళ్లి గ్రామంలో వ్యవసాయ అధికారి గణేశ్ పొలం పిలుస్తోంది కార్యక్రమం బుధవారం నిర్వహించారు. సర్పంచి ఆంజనేయులు, ఎంపీటీసీ సభ్యుడు రామాంజనేయులు, తెదేపా నాయకులు నాగేశ్, రైతులు పాల్గొన్నారు.

పెద్దకడబూరు, న్యూస్‌టుడే: మండలంలోని బసలదొడ్డి గ్రామానికి చెందిన మల్లేశ్ కుమారుడు వీరేశ్ ఆటో ప్రమాదంలో మృతి చెందారు. విషయం తెలుసుకొన్న మంత్రాలయం వైకాపా నాయకుడు ప్రదీప్‌రెడ్డి బుధవారం వీరేశ్ కుటుంబాన్ని ఓదార్చి రూ.10 వేల ఆర్థిక సాయం చేశారు.

కోసిగి, న్యూస్‌టుడే: మండలంలో సీసీ రోడ్లు, తాగునీరు, డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఇన్‌ఛార్జి ఎంపీడీవో, ఏవో పీ.వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. అవుకు ఎంపీడీవో కార్యాలయంలో ఏవోగా విధులు నిర్వహించిన ఆయన బదిలీపై కోసిగికి వచ్చారు. బుధవారం వెంకటేశ్వర్లు బాధ్యతులు చేపట్టారు. ఈ నెల 14 నుంచి 20 వరకు గ్రామాల్లో పల్లె పండగ, గ్రామ పంచాయతీ వారోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

గూడూరు న్యూస్‌టుడే: మండల పరిధిలోని కె. నాగలాపురం సుంకులమ్మను పత్తికొండ మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి బుధవారం దర్శించుకున్నారు. ఆమె కుటుంబ సభ్యులతో వచ్చి అమ్మవారికి 0.05 గ్రాముల బంగారు బొట్టు, సారె సమర్పించి మొక్కు తీర్చుకున్నారు. ఈవో నరసయ్య ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రసాదాలు అందజేసి, శాలవతో సన్మానించారు.

గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం

నందవరం, న్యూస్‌టుడే: తుంగభద్ర నదిలో గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు హెడ్ కానిస్టేబుల్ సుభాన్ తెలిపారు. కర్ణాటక రాష్ట్రం చిక్‌బల్లాపూర్ జిల్లా గౌరీ బిదనూర్ తాలూకా ద్వారగనహళ్లి గ్రామానికి చెందిన జి.సుబ్బరాయప్ప(41) మంత్రాలయం రాఘవేంద్ర స్వామి దర్శనానికి వచ్చి స్నానానికి వెళ్లి ప్రమాదవశాత్తు నదిలో పడి గల్లంతయ్యారు. నందవరం మండలం గంగవరం-జొహరాపురం గ్రామాల మధ్యలో మృతదేహం కనిపించినట్లు సుభాన్ బుధవారం వివరించారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

కర్నూలు

•కర్నూలు • పాణ్యం



ఆలయం ఎదుట ధర్నా చేస్తున్న దేవాలయ రక్షణ కమిటీ సభ్యులు

ఆలయంలో మౌలిక వసతులు కల్పించాలి

కర్నూలు బి.క్యాంపు, న్యూస్‌టుడే: బళ్లారి చౌరస్తా వద్ద నున్న ఆంజనేయ స్వామి ఆలయంలో మౌలిక వసతులు కల్పించాలని కోరుతూ దేవాలయ రక్షణ కమిటీ రాష్ట్ర కమిటీ సభ్యుడు రామాంజనేయులు, మధు, విజయ్, గంగాధర్ ఆలయం ఎదుట ధర్నా చేశారు. బుధవారం వారు ఆలయ పరిసర ప్రాంతాలను పరిశీలించి మాట్లాడారు. భక్తుల మనో భావాలు దెబ్బతినే విధంగా ప్రవరిస్తున్న ఈవోను సస్పెండ్ చేయాలన్నారు.

డీపీవో ఏవోగా సి.రత్నకుమార్

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే: జిల్లా పోలీసు కార్యాలయం పరిపాలనాధికారిగా సి. రత్న కుమార్ నియమితులయ్యారు. గ్రేహౌండ్స్‌లో పరి పాలనాధికారిగా ఉన్న ఆయన్ని గతంలో జిల్లా పోలీస్ కార్యాలయం ఇన్‌ఛార్జి పరిపాలనాధికారిగా నియమించారు. బుధవారం రాష్ట్ర డీజీపీ ద్వారకా తిరుమలరావు ఆయన్నే రెగ్యులర్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
కర్నూలు : 80085 52632
కర్నూలు గ్రామీణం : 85010 05408
ఓర్వకల్లు : 63004 66875

కర్నూలు నగర పాలక సంస్థ: **సమస్య:** జొహరాపురంలో జేపీ-12/3 విద్యుత్తు స్తంభానికి దీపం వెలగడం లేదు. **- స్థానికులు**

సమస్య: నంద్యాల చెక్‌పోస్టు సమీపంలో రహదారి గుంతలమయంగా మారింది. రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నాం. **- వీరేశ్**

సమాధానం: సమస్యల్ని పరిశీలించి పరిష్కరిస్తాం. **- నగర పాలక అధికారులు**

జేఏవోగా బాధ్యతల స్వీకరణ

కర్నూలు వెంకటరమణ కాలనీ, న్యూస్‌టుడే: కర్నూలు డివిజన్ విద్యుత్తు శాఖ కార్యాలయంలో జేఏవోగా విధులు నిర్వహిస్తున్న రాఘవేంద్ర ప్రసాద్‌ని కర్నూలు ఎస్ఈ కార్యాలయానికి బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన బుధవారం పీఆర్ సెక్షన్‌లో జేఏవోగా బాధ్యతలు చేపట్టారు. పలువురు ఉద్యోగులు, సిబ్బంది, కార్మికులు ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.



రాఘవేంద్రప్రసాద్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తున్న ఉద్యోగులు

13 నుంచి అల్లాబకాష్ దర్గా ఉరుసు

కర్నూలు విద్య, న్యూస్‌టుడే: నగరంలోని జొహరాపురంలో సయ్యద్ అల్లాబకాష్ దర్గా ఉరుసును ఈ నెల 13 నుంచి 15 వరకు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ముతావలీ సయ్యద్ అల్లావుద్దీన్ షరీఫ్ పాషా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 13న గంధం, 14న ఉరుసు, 15న జియారత్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.


ఉంటుందా.. ఊడుతుందా

★ మేయర్ పీఠంపై కూటమి కసరత్తు ★ అవకాశం కోసం కార్పొరేటర్ల ఎదురుచూపు

తెదేపా వైపు పలువురి చూపు

కర్నూలు నగర పాలక కింద నగరంలో 33, కల్లూరు ప్రాంతంలో 16, కోడుమూరు నియోజకవర్గ పరిధిలో 3 కలుపుకొని మొత్తం 52 వార్డులున్నాయి. కార్పొరేషన్ ఎన్నికల్లో తెదేపాకు 8, స్వతంత్రులు ఒకరు ఎన్నికయ్యారు. మిగతా 43 మంది వైకాపాకు చెందిన వారే. 17వ వార్డు కార్పొరేటర్ వైకాపా పద్మలతా రెడ్డి, 22వ వార్డు కార్పొరేటర్ షేక్ అలియా, 11వ వార్డు కార్పొరేటర్ ఫరాజ్‌ఖాన్ ఎన్నికల ముందు, కూటమి ప్రభుత్వం గెలిచిన తర్వాత 3, 6, 13, 5వ వార్డు కార్పొరేటర్లు మంత్రి టీజీ భరత్ సమక్షంలో తెదేపాలో చేరారు. తెదేపా సీనియర్ నాయకుడు విష్ణు వర్ధన్‌రెడ్డి సమక్షంలో 38వ వార్డు కార్పొరేటర్ గిప్సన్, కల్లూరు పట్టణం 30వ వార్డు కార్పొరేటర్ కాశపోగు జయరాముడు తెదేపా నేత బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి సమక్షంలో ఎన్నికల ముందు తెదేపా తీర్థం పుచ్చుకున్నారు. ఇటీవల 12వ వార్డు కార్పొరేటర్ క్రాంతికుమార్, 9వ వార్డు కార్పొరేటర్ పుల్లమ్మ తెదేపాలోకి వచ్చారు. ప్రస్తుతం 19 మంది కార్పొరేటర్లు తెదేపాలో ఉండగా, తెదేపా నుంచి గెలిచిన 51వ వార్డు కార్పొరేటర్ మౌనికరెడ్డి ఎన్నికల ముందు పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేశారు.

కర్నూలు నగర పాలక సంస్థ, న్యూస్‌టుడే: మేయర్ పీఠం దక్కించుకునేందుకు కూటమి ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా పలు పురపాలక, నగర పాలక సంస్థల్లో మేయర్ పదవులు కైవసం చేసుకుంది. తాజాగా కర్నూలు నగర మేయర్ పీఠాన్ని కూడా కైవసం చేసుకునే పనిలో ఉన్నారు. ఇప్పటికే పలువురు వైకాపా కార్పొరేటర్లు తెదేపాలో చేరారు. తెదేపా కార్పొరేటర్ల బలం పెరిగితే వైకాపాకు చెందిన మేయర్‌ను దింపేందుకు మార్గం సుగమమవుతుంది. మరికొన్ని నెలల్లో ఇది కార్యరూపం దాల్చనున్నట్లు చర్చ సాగుతోంది.



తొలుత అవిశ్వాసం పెట్టాలి

మేయర్‌ను పదవి నుంచి దింపడానికి తొలుత కౌన్సిల్‌లో అవిశ్వాసం పెడతారు. 52 మంది కార్పొరేటర్లు ఉన్న కౌన్సిల్‌లో ఇప్పటికే తెదేపాకు చెందిన వారు 19 మంది ఉన్నారు. 52 మందిలో రెండొంతుల మంది ఆయనకు వ్యతిరేకంగా చేయి ఎత్తితే మేయర్‌గా కొనసాగడానికి సరిపడా బలం లేదని తీర్మానించి రాష్ట్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయొచ్చు. ఆ మేరకు ఎన్నికల సంఘం కొత్త మేయర్ ఎన్నికకు నోటిఫికేషన్ జారీ చేస్తుంది. కల్లూరు పట్టణ పరిధిలోని పలువురు వైకాపా కార్పొరేటర్లు తెదేపాలోకి వచ్చేందుకు చూస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే వారు నేతలతో సంప్రదించారని తెలిసింది.

ఎప్పటి నుంచో వ్యతిరేకత

మేయర్ బీవై రామయ్యపై ఎప్పటి నుంచో వైకాపాకు చెందిన కార్పొరేటర్లే వ్యతిరేకంగా ఉండటం గమనార్హం. పార్టీ కార్యక్రమాల్లో పెద్దలకు సైతం ఆయనపై ఫిర్యాదు చేసిన సందర్భాలున్నాయి. వార్డులకు నిధుల కేటాయింపు విషయం, అభివృద్ధి అంశాల్లో తమకు సహకరించడం లేదని చాలా మంది ఆవేదన చెందారు. ఏకంగా కౌన్సిల్ సమావేశాల్లోనే ఆయనపై మండిపడ్డారు. నీ వార్డుకే నిధులు కేటాయించుకుంటున్నావని నిలదీశారు. ఆయనపై ఎన్నో రోజులుగా వ్యతిరేకత ఉందని దీంతో ఆయన్ని పదవి నుంచి దింపే అవకాశం కోసం ఎదురుచూస్తున్నట్లు సమాచారం.

సేవాగుణం అలవర్చుకోవాలి



ప్రార్థన చేస్తున్న సయ్యద్ ముబషిర్ పాషా ఖాద్రీ, ముస్లింలు

కర్నూలు విద్య, న్యూస్‌టుడే: కష్టాల్లో ఉన్న వారిని ఆదుకునే సేవాగుణాన్ని అలవర్చుకోవాలని జామియా ఖమరుల్ ఖుదా వ్యవస్థాపకుడు సయ్యద్ ముబషిర్ పాషా ఖాద్రీ అన్నారు. బుధవారం నగరంలోని అశోక్‌నగర్‌లో గుల్షన్ ఏ ఖమర్‌లో మహిఫిల్ ఎ జికిర్ ఎ ఖదీరియా దువా నిర్వహించారు. 'సర్కాక్ కె ఆమద్ మర్హాబా'లో భాగంగా ప్రవక్త జీవిత చరిత్రను ప్రతి ముస్లిం తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సయ్యద్ షా ముక్రమ్ పాషా ఖాద్రీ, సయ్యద్ నూరుల్లా ఖాద్రీ, సయ్యద్ ఖుద్రతుల్లా ఖాద్రీ పాల్గొన్నారు.

ముగిసిన చిన్నారుల శిబిరం

కల్లూరు గ్రామీణ, న్యూస్‌టుడే: చైల్డ్ ఇవాంజలిజం ఫెలోషిప్ ఆఫ్ కర్నూలు ఆధ్వర్యంలో కోల్స్ కళాశాల ఆవరణలో మూడు రోజులుగా నిర్వహించిన చిల్డ్రన్స్ క్యాంప్ బుధవారంతో ముగిసింది. సీఈఎఫ్ డైరెక్టర్ ప్రభుదాస్, ఎస్టీబీసీ కళాశాల కరస్పాండెంట్ డా. ఆర్ఆర్‌డీ సజీవరాజు, ప్రిన్సిపల్ ఆర్. ప్రశాంతి స్టీఫెన్, కోల్స్ కళాశాల ప్రిన్సిపల్ ఝాన్సీ సిమ్యాన్, పాస్టర్ జీవన్ హాజరై మాట్లాడారు. చిన్నారులకు నిర్వహించిన పోటీల్లో గెలిచిన వారికి బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో అనిల్‌నాథ్, విజయకుమార్ పాల్గొన్నారు.



బహుమతులతో చిన్నారులు

రహదారిపై వ్యర్థాలు

జొహరాపురంలోని వీధుల్లో రహదారులపై చెత్త, వ్యర్థాలు దర్శనమిస్తున్నాయి. సకాలంలో చెత్త సేకరణ, తొలగింపు జరగడం లేదని స్థానికులు వాపోతున్నారు. రహదారులపై వ్యర్థాలు నిల్వ ఉండటంతో దుర్వాసన వెదజల్లుతోందని చెబుతున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, కల్లూరు గ్రామీణం



అభివృద్ధే ప్రభుత్వ అజెండా

కల్లూరు గ్రామీణం, న్యూస్‌టుడే: గ్రామాలను అభివృద్ధి చేయడమే కూటమి ప్రభుత్వం అజెండా అని ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి అన్నారు. కల్లూరు మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ భవనంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మండల అధికారులు ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అందరి సమన్వయంతో మండల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. సమావేశంలో ఎంపీపీ శారదమ్మ, ఎంపీడీవో నాగశేషాచల్‌రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి

త్వరలో తెదేపా సభ్యత్వ నమోదు

త్వరలో తెదేపా సభ్యత్వ నమోదు చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, తెదేపా నేత గౌరు వెంకటరెడ్డి తెలిపారు. బుధవారం తెదేపా సభ్యత్వ నమోదుపై నియోజకవర్గ పరిధిలోని బూత్ యూనిట్లు, క్లస్టర్ ఇన్‌ఛార్జిలకు అవగాహన కల్పించారు. లక్ష మందికి తగ్గకుండా సభ్యత్వ నమోదు చేయాలన్నారు. పార్టీలో కష్టపడి పని చేసిన వారికి సముచిత స్థానం కల్పిస్తామన్నారు.

నేతలను కలిసిన జనసేన నాయకుడు

కల్లూరు గ్రామీణం, న్యూస్‌టుడే: పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, జనసేన రాజకీయ వ్యవహారాల కార్యదర్శి, ఎమ్మెల్సీ పిడుగు హరిప్రసాద్‌ను కలిసి పలు అంశాలను చర్చించినట్లు జనసేన కర్నూలు నియోజకవర్గ సమన్వయకర్త అర్షద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

బహుజనులను ఏకం చేసిన యోధుడు

కర్నూలు బి.క్యాంపు, న్యూస్‌టుడే: కుల నిర్మూలనకు ఉద్యమం చేపట్టి బహుజనులను ఏకం చేసిన యోధుడు కాన్షిరాం అని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంఘం వ్యవస్థాపక అధ్యక్షురాలు పట్నం రాజేశ్వరి అన్నారు. బి.క్యాంపు హౌసింగ్ బోర్డు కాలనీలోని జిల్లా కార్యాలయంలో బుధవారం కాన్షిరాం, మొదటి ముస్లిం మహిళా ఉపాధ్యాయురాలు ఫాతిమా షేక్ వర్ధంతి సందర్భంగా వారి చిత్రపటాలకు నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షురాలు నంది విజయలక్ష్మి, జిల్లా కమిటీ సభ్యులు ఖాసింబీ, రంగమ్మ, అమినాబీ పాల్గొన్నారు.

జాతీయ ప్రతిభా పురస్కారానికి ఎంపిక

కర్నూలు విద్య, న్యూస్‌టుడే: నగరంలోని ఉస్మానియా కళాశాలలో తెలుగు శాఖ అధ్యక్షుడిగా ఉన్న డాక్టర్ మండి అన్వర్ హుస్సైన్ డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జాతీయ ప్రతిభా పురస్కారానికి ఎంపికైనట్లు ఎస్‌పీఎల్‌టీవో గౌరవాధ్యక్షుడు, ఎమ్మెల్సీ లక్ష్మణరావు బుధవారం తెలిపారు. ఈ నెల 20న గుంటూరులో ఈ పురస్కారం అందుకుంటారని పేర్కొన్నారు. తెలుగు భాషాభివృద్ధికి కృషి చేసినందుకు జాతీయ ప్రతిభా పురస్కారానికి ఎంపికైనట్లు వెల్లడించారు.

అమ్మా భవాని.. శక్తి స్వరూపిణి



కర్నూలు ఆధ్యాత్మికం: విజ్ఞాన మందిరంలో పూజలు చేస్తున్న మహిళలు



సూర్యనారాయణ స్వామి ఆలయంలో అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు



సత్యసాయి మందిరంలో చండీహోమం చేస్తున్న దంపతులు

కర్నూలు ఆధ్యాత్మికం, కర్నూలు బి.క్యాంపు, కల్లూరు గ్రామీణం, న్యూస్‌టుడే: నగరంలోని పాతబస్తీలోని లలితా పీఠం, కాళికాంబ ఆలయం, గీతా మందిరం, నిమిషాంబ, చిన్నఅమ్మవారి శాల, భద్రావతి భావనారాయణ, సప్తగిరి కాలనీలో చౌడేశ్వరి, సూర్యనారాయణ, నెహ్రూనగర్‌లోని సత్యసాయి, కల్లూరులోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.



కర్నూలు ఆధ్యాత్మికం: పాతబస్తీ నిమిషాంబ ఆలయంలో...



కల్లూరు గ్రామీణం: కల్లూరులోని ఈశ్వర, వీరభద్ర స్వామి దేవాలయంలో..



కల్లూరు గ్రామీణం: వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో..



కర్నూలు బి.క్యాంపు: సి.క్యాంపు సెంటర్‌లోని విజయగణపతి ఆలయంలో సర్వసతిదేవీ అలంకరణ



కర్నూలు బి.క్యాంపు: భరతమాత ఆలయంలో సరస్వతిదేవీగా..



ఓర్వకల్లు: హోమంలో మల్లెల రాజశేఖర్ దంపతులు



కర్నూలు బి.క్యాంపు: బుధవారపేటలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



కర్నూలు విద్య: హెచ్ఆర్సీలో పూజలు చేస్తున్న ఉద్యోగులు

భూములు తవ్విన వారిపై చర్యలు తీసుకోవాలి

ఓర్వకల్లు న్యూస్‌టుడే: మండలంలోని శకునాలకు చెందిన కాశీ రామేశ్వరస్వామి ఆలయానికి చెందిన భూములను తవ్వేసిన అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి రామకృష్ణ పేర్కొన్నారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఏడాది కిందట వైకాపా ప్రభుత్వ హయాంలో గ్రామంలోని ఆలయ భూములు 18 ఎకరాల్లో 10 నుంచి 15 అడుగుల లోతు గుంతలు తవ్వేసి సోలార్ పరిశ్రమకు, ప్రైవేటు వెంచర్లకు విచ్చలవిడిగా అమ్ముకున్న గుత్తేదారులపై చర్యలు తీసుకోవడంలో గత ప్రభుత్వం విఫలమైందన్నారు. కూటమి ప్రభుత్వం అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ తహసీల్దార్ విద్యాసాగర్‌కు వినపతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాగన్న, వెంకటేశ్వర్లు, చాంద్‌బాషా, మాసుంబాషా, నాగరాజు, భాస్కర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

గొలుసు దొంగల హల్‌చల్

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే: కర్నూలులోని బి.క్యాంపు హౌసింగ్ బోర్డు కాలనీలో బుధవారం ఉదయం గొలుసు దొంగలు హల్‌చల్ చేశారు. కాలనీకి చెందిన నాగశివయ్య భార్య నాగలక్ష్మి ఉదయం ఆరు గంటల సమయంలో ఇంటి ఎదుట ఉండగా ఇద్దరు దుండగులు ద్విచక్ర వాహనంపై సమీపించారు. క్షణాల్లో ఆమె మెడలోని మూడు తులాల పుస్తెల గొలుసును తెంపుకొని వాహనం వేగం పెంచి ఉడాయించారు. కర్నూలు మూడో పట్టణ పోలీస్‌స్టేషన్ పోలీసులు బాధితురాలిని విచారించారు. సీసీ కెమెరాల ఫుటేజీ ద్వారా దుండగులను గుర్తించి పట్టుకునే యత్నం చేస్తున్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కంప్యూటర్ దుకాణ నిర్వాహకుడిపై కేసు నమోదు

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే: కర్నూలులోని భాస్కర్‌నగర్‌లో సన్‌టెక్ కంప్యూటర్ దుకాణ నిర్వాహకుడు మనోహర్‌పై కర్నూలు రెండో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. బీక్యాంపులోని ఓ ఎన్జీవో సంస్థ ఉద్యోగి రాంపుల్లయ్య 50 కంప్యూటర్ల కోసం నిందితుడికి రూ.23 లక్షలు చెల్లించారు. 18 కంప్యూటర్లు మాత్రమే డెలివరీ చేసిన నిందితుడు మరో 32 కంప్యూటర్లు ఇవ్వకుండా జాప్యం చేశాడు. చివరకు దుకాణం మూసివేసి పరారు కావడంతో రాంపుల్లయ్య జరిగిన మోసంపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

వీధి బాలలను కాపాడాలి

కర్నూలు న్యాయవిభాగం, న్యూస్‌టుడే: ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పని చేసి వీధి బాలలను కాపాడాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి లీలా వెంకటశేషాద్రి సూచించారు. బుధవారం న్యాయ సేవాసదన్‌లో మహిళా పోలీస్‌స్టేషన్ డీఎస్పీ శ్రీనివాసాచారి, జిల్లా కార్మిక శాఖ అధికారి సాంబశివ, బాలల సంరక్షణ కమిటీ ఛైర్మన్ జుబేదా బేగంతో ఆయన సమావేశం నిర్వహించారు. బాల కార్మికులు, అనాథలను గుర్తించి వారికి మంచి భవిష్యత్తును కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.

భారీ వాహనాలు.. సర్వీస్ దారిలో కష్టాలు

☛ సంతోష్‌నగర్ హైవేపై నిత్యం ట్రాఫిక్ సమస్య



కొత్త ఈద్గా సమీపంలో నిలిచిపోయిన వాహనాలు

కర్నూలు విద్య, న్యూస్‌టుడే: కర్నూలు నగర శివారులోని సంతోష్‌నగర్ జాతీయ రహదారిలో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. నివారణకు చర్యలు చేపట్టినా సమస్యకు పరిష్కారం లభించలేదని వాహనదారులు, స్థానికులు వాపోతున్నారు. సంతోష్‌నగర్ ఆటో స్టాండు సర్కిల్‌ను పూర్తిగా మూసి వేయడంతో సమస్య మరింత పెరిగింది.

సర్వీసు రహదారిలోని హోటళ్లు, దుకాణాల ఎదుట వాహనాలు నిలుపుతుండటంతో ద్విచక్ర వాహన చోదకులు, ఆటోవాలాలు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. సాయంత్రం 6 గంటల నుంచి భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుండటంతో ట్రాఫిక్ సమస్య తీవ్రమైందని స్థానికులు వాపోతున్నారు. ముఖ్యంగా కొత్త ఈద్గా సమీపంలో డైరెక్షన్స్ చూపించేందుకు ట్రాఫిక్ కానిస్టేబుల్ లేకపోవడం ఒక కారణమైతే, వెంకటరమణ కాలనీకి వెళ్లే దారిలో, వాహన షోరూంల ఎదుట పార్కింగ్ చేస్తున్న కార్లతో ట్రాఫిక్ సమస్య మరింత జటిలమవుతోంది. రోడ్డుపై ఎందుకు పార్కింగ్ చేస్తున్నారని అడిగిన పాదచారులపై దాడికి పాల్పడుతున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండు రోజుల కిందట కురిసిన వర్షానికి విశాల్ మార్ట్ ఎదురుగా అడుగు మేర మురుగు నిలిచింది. దీంతో పార్కింగ్ రోడ్డుపైనే ఉండటంతో అటుగా వెళ్లే వాహనచోదకులకు, అక్కడి పండ్ల వ్యాపారులకు మధ్య గొడవ చోటుచేసుకుంది. నిత్యం ఇదే పరిస్థితి నెలకొంటోందని, సర్వీసు దారికి ఇరువైపులా ఉండే స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

ఈ సమయంలో రద్దీ ఎక్కువ

ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల మధ్య, సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు రద్దీ ఎక్కువగా ఉంటోంది. దీంతో సర్వీసు రోడ్డుకు ఇరువైపుల ఉన్న కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు. రెండు రోజుల కిందట (8వ తేదీ) సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ట్రాఫిక్ స్తంభించింది. దీంతోపాటు వర్షం కురవడంతో వాహనచోదకులు అవస్థలు పడ్డారు. ట్రాఫిక్ నియంత్రించాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో కాలనీవాసులు, వాహనచోదకులు కష్టాలు వర్ణనాతీతం.

నియంత్రణ చర్యలు చేపట్టాలి

- సుబ్బయ్య, సంతోష్‌నగర్

కొత్త ఈద్గా సమీపంలోని వంతెన వద్ద నిత్యం ట్రాఫిక్ స్తంభిస్తోంది. నాలుగు వైపుల నుంచి ఒకేసారి వాహనాలు వచ్చిన సమయంలో అర గంటకుపైగా వేచి ఉండాల్సి వస్తోంది. ఈ ప్రాంతంలో ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

విజయంతో క్రీడాకారుల్లో ఉత్తేజం

కర్నూలు క్రీడలు, న్యూస్‌టుడే: పతకాలు అందుకున్న క్రీడాకారుల్లో కొత్త ఉత్తేజం వస్తుందని కలెక్టర్ రంజిత్‌బాషా అన్నారు. అక్టోబరు 4 నుంచి 6వ తేదీ వరకు రాజమహేంద్రవరంలో జరిగిన అంతర్ జిల్లాల జూనియర్ అథ్లెటిక్స్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు 7 స్వర్ణం, 8 రజతం, 14 కాంస్య పతకాలు సాధించారు. ఇందులో ఐదుగురు అథ్లెట్లు గుంటూరులో జరిగే జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. వారిని కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు, డీఎస్ఏ అథ్లెటిక్స్ శిక్షకుడు కాశీరావు పాల్గొన్నారు.



జాతీయ అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో కలెక్టర్

సీబీఎస్ఈ తైక్వాండో పోటీలకు ఎంపిక

కర్నూలు క్రీడలు (బి.క్యాంపు), న్యూస్‌టుడే: ఇటీవల తమిళనాడులో జరిగిన దక్షిణ ఇండియా తైక్వాండో ఛాంపియన్‌షిప్‌లో రిడ్జి పాఠశాల క్రీడాకారులు నాలుగు బంగారు పతకాలు సాధించారు. ఉత్తరాఖండ్ రాష్ట్రం రుద్రకోట్ జిల్లాలోని మదరిండియా పబ్లిక్ పాఠశాలలో జరిగే సీబీఎస్ఈ జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. వెంకట ఉదయ్‌తేజ్, యశ్వంత్ రెడ్డి, ప్రణియ, కీర్తి పాల్గొంటున్నట్లు పాఠశాల సీఈవో గోపినాథ్ తెలిపారు. వీరిని బుధవారం ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో డీన్ రాజేంద్రన్, ప్రిన్సిపల్ రాజ్‌కమల్, తైక్వాండో మాస్టర్ సుందర్‌రాజు పాల్గొన్నారు.



జాతీయ పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో సీఈవో గోపినాథ్

ఉచిత శిక్షణ

కల్లూరు గ్రామీణం, న్యూస్‌టుడే: కెనరా బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో ఉమ్మడి కర్నూలు జిల్లాకు చెందిన గ్రామీణ ప్రాంత మహిళలకు 'మగ్గం, ఎంబ్రాయిడరీ, ఫ్యాబ్రిక్ పెయింటింగ్‌లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ కె.పుష్పక్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణ సమయంలో ఉచిత భోజనం, వసతి కల్పిస్తామన్నారు. మరిన్ని వివరాలకు కల్లూరు తహసీల్దార్ కార్యాలయం సమీపంలోని సంస్థ కార్యాలయంలో, చరవాణి 63044 91236 ద్వారా సంప్రదించాలన్నారు.

వృత్తి విద్యార్థులకు సూచనలు

ఓర్వకల్లు న్యూస్‌టుడే: వృత్తి విద్యా కార్యక్రమంలో భాగంగా ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ జోషిలావాట్స్ సహకారంతో కర్నూలులోని హోమ్ అప్లియన్సెస్ రిపేరి షాప్స్ ఎలక్ట్రానిక్స్‌కి సంబంధించిన సంస్థలతో జరుగుతున్న ఇంటర్న్‌షిప్‌లో ఆదర్శ పాఠశాల విద్యార్థులు బుధవారం శిక్షణ పొందారు. శిక్షణ పనితీరును రాష్ట్ర ఒకేషనల్ కోఆర్డినేటర్ కమలాకర్ పరిశీలించి సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్లు వంశీ, చిన్నారెడ్డి, విక్రమ్ పాల్గొన్నారు.

వంటనూనెలు సరసమైన ధరలకు విక్రయించాలి

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: ప్రజలకు వంటనూనెలను సరసమైన ధరలకు విక్రయించాలని జిల్లా పౌరసరఫరాల అధికారి రాజా రఘువీర్ పేర్కొన్నారు. బుధవారం నగరంలోని స్థానిక సి.క్యాంపు రైతుబజార్‌లో ప్రత్యేక కౌంటర్ల ద్వారా వంటనూనెల విక్రయ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. సన్‌ఫ్యూర్ లీటర్ రూ.126, పామాయిల్‌ను రూ.121కు విక్రయించాలని, అంతకంటే ఎక్కువ ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవన్నారు. పండగల నేపథ్యంలో వ్యాపారులు ప్రజలకు జిల్లా సంయుక్త కలెక్టర్ ఆధ్వర్యంలో నిర్ణయించిన ధరలకే విక్రయించాలన్నారు. సన్‌ఫ్యూర్, సన్ జ్యోతి, సన్ ప్రీతి లీటర్ రూ.126, పామాయిల్ లీటర్ రాయల్ గోల్డ్ రూ.119, ప్రియాగోల్డ్ రూ.121, పామ్ గోల్డ్ రూ.119కు విక్రయించాలన్నారు. అధిక ధరలకు విక్రయిస్తే బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు.



వంటనూనె విక్రయ కేంద్రాన్ని ప్రారంభించిన రాజా రఘువీర్